మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

26.2.2025 బుధవారం Wednesday | సంపుటి (Volume): 09 సంచిక (Issue) : 315 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## ఛాంపియన్స్ ట్రోఫీలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మ్యాచ్ రద్దు



07



## రుజువు చేయగలవా?

- తెలంగాణకు ఎక్కడ అడ్డుపడ్డానో చూపిస్తావా?
- సీఎం వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి


02



# ట్రిలియన్ డాలర్ల ఆర్థికశక్తిగా

## తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం

- లైఫ్ సైన్సెస్ రంగంలో గణనీయమైన ప్రగతి
- దేశ, విదేశాల నుంచి పెట్టుబడులు ఆహ్వానిస్తాం
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌మధ్య ఫార్మా విలేజ్‌లు
- తద్వారా 5 లక్షల ఉద్యోగాల కల్పన
- ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం
- బయో ఏషియా సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి



### హైదరాబాద్ కేంద్రంగా చికున్ గున్యా వ్యాక్సిన్ తయారీ

- బవేరియన్‌నార్డిక్‌కంపెనీతో బయోలాజికల్‌ఈ ఫార్మా ఒప్పందం
- కొత్తగా 300 మందికి ఉద్యోగ అవకాశం

03

**హైదరాబాద్, జనతా న్యూస్:** ప్రతి ఏటా నిర్వహించే బయో ఏషియా సదస్సు హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా నిలబెట్టిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హెల్త్ కేర్ రంగం భవిష్యత్ నిర్దేశించటంతోపాటు ప్రపంచానికే మార్గదర్శనం చేసేలా బయో ఏషియా దేశ విదేశాలను ఆకర్షిస్తోందని చెప్పారు. దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన ఫార్మా, హెల్త్ కేర్, లైఫ్ సైన్స్, బయోటెక్ కంపెనీలు ఎన్నో హైదరాబాద్ నుంచి పనిచేస్తున్నాయని సీఎం చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బయో ఏషియా-2025 కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

మిగతా 2 లో



## పట్టభద్రులకు మీరేం చేశారు

- మత రాజకీయాలు తప్ప బీజేపీకి ఏమీ చేతకాదు
- చెప్పుకోవటానికి ఒక్కటైనా ఉందా?
- మతం పేరు లేకుండా బండి ఒక్క మాట మాట్లాడ లేదు : సీతక్క

03

## బీఆర్ఎస్ లేకుండా చేయాలని బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు



- ఎన్ని కుట్రలు చేసినా జనం గుండెల్లో నిలిచేది బీఆర్ఎస్సే
- మాటమార్చిన రేవంత్
- కాంగ్రెస్ అంటేనే కరువు : మాజీ మంత్రి కేటీఆర్

03



## ఎస్సీ వర్గీకరణకు త్వరలో చట్టబద్ధత

- వర్గీకరణలో ఎవరి వాటా వారికి దక్కుతుంది
- సీఎం రేవంత్ సాహసోపేత నిర్ణయంతోనే సాధ్యం
- మాదిగ అమరుల కృతజ్ఞత సభలో మంత్రి దామోదర

# సర్వశక్తులు ఒడ్డుతాం



02

## గల్లంతైన వారి రక్షణకు చర్యలు

- ప్రమాదవశాత్తు ఘటనలపై విమర్శలు తగవు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

శ్రీశైలం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో జరిగిన ప్రమాద సంఘటనలు చిక్కుకున్న ఎనిమిది మందిని సురక్షితంగా తీసుకురావడానికి దేశంలో అందుబాటులో ఉన్న అత్యున్నత పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి స్పష్టం చేశారు. భట్టి విక్రమార్క ఆద్వర్యంలోని మంత్రులబృందం మంగళవారం ఎస్ఎల్ బీసీ ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించి సహాయ కార్యక్రమాలను అంచనా వేశారు. అనంతరం, వారు ప్రాజెక్ట్ స్థలంలోని జేపీ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి సహాయ కార్యక్రమాలపై సమీక్షించారు.

## హైదరాబాద్‌లో డేంజర్ బెల్స్

04



## ఒక్క రోజే రేషన్‌కార్డులు లక్ష

### మార్చి 1న పంపిణీకి నిర్ణయం

- ఒక్క రోజే భారీ మొత్తంలో పంచేందుకు ఏర్పాట్లు
- మొదట హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్
- మార్చి 8 తర్వాత మిగతా ప్రాంతాల్లో షురూ!



02

ఒక్క రోజే లక్ష రేషన్ కార్డులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. మార్చి 1వ తేదీన పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మొదట హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్ చేయాలని భావిస్తున్నది. మార్చి 8వ తర్వాత మిగతా ప్రాంతాల్లో ప్రారంభించేందుకు యోచిస్తున్నది.



## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతే రాజీనామా చేస్తారా

- ఈ ఎన్నికలను రెఫరెండంగా తీసుకుంటారా
- సీఎం రేవంత్‌రు ఎంపీ రఘునందన్ రావు సవాల్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే రాజీనామాకు రేవంత్ రెడ్డి సిద్ధమా అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సవాల్ విసిరారు.

## అన్నమయ్య జిల్లాలో
# ఏనుగుల బీభత్సం

**దాడిలో ముగ్గురు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు**

**తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం, డిప్యూటి సిఎం**

**మృతుల కుటుంబాలకు పదిలక్షల పరిహారం ప్రకటన**

**మదనపల్లె, ఫిబ్రవరి 25 :** అన్నమయ్య జిల్లాలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఓబులవారిపల్లె మండలం గుండాలకోన వద్ద భక్తులపై దాడి చేశాయి. ఈ ఘటనలో ముగ్గురు భక్తులు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. శివరాత్రిని పురస్కరించుకుని వై.కోటకు చెందిన భక్తులు ఆలయానికి నడుచుకుని వెళ్తుండగా వారిపై ఏనుగులు దాడి చేశాయి. మృతులను వంకాయల దినేష్, తుపాకుల మణమ్మ, చంగల్ రాయుడుగా గుర్తించారు. ఏనుగుల దాడిలో ముగ్గురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సీఎం ప్రకటించారు. ఏనుగుల దాడి ఘటనపై డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ స్పందించారు. ముగ్గురు చనిపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు, తీవ్రంగా గాయపడినవారికి రూ.5లక్షల పరిహారం ప్రకటించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్‌ను వై.కోటకు వెళ్లాలని పవన్ ఆదేశించారు. అసెంబ్లీ నుంచి హుటాహుటిన అక్కడికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించాలన్నారు. దీనిపై సమగ్ర నివేదిక అందజేయాలని అటవీశాఖ అధికారులను పవన్ ఆదేశించారు.

# రుజువు చేయగలవా?

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 :** రేవంత్ రెడ్డికి దమ్ము ఉంటే తాను ఎప్పుడు ఎక్కడ తెలంగాణకు అడ్డుపడ్డానో రుజువు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పదవుల కోసం పార్టీలు మారి కాళ్లు పట్టుకొనే వాడిని తాను కాదని తేల్చిచెప్పారు. ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం రేవంత్ చేతిలో ఉంది.. ఆయన ఎలాంటి విచారణ చేస్తారో చేసి తమకు అప్పగించాలని కిషన్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా విమర్శలు చేయడం వల్లనే తాను గట్టిగా సమాధానం ఇవ్వాల్సి వస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదని స్పష్టం చేశారు. దేశం మీద భక్తితో, జెండా మీద గౌరవంతో బీజేపీలో మాములు కార్యకర్తగా వచ్చి ఈ స్థాయికి వచ్చానని అన్నారు. కేంద్రమంత్రి హోదాలో ఉన్న తనను పట్టుకొని తెలంగాణకు అడ్డుపడ్డ వ్యక్తి అంటూ మాట్లాడటం రేవంత్ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతే
# రాజీనామా చేస్తారా

**సిద్దిపేట, ఫిబ్రవరి 25:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే రాజీనామాకు రేవంత్ రెడ్డి సిద్ధమా అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సవాల్ విసిరారు. పనిచేశా.. ఓటు వేయమంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను తన పాలనకు రెఫరెండంగా తీసుకుంటారా అని ప్రశ్నించారు. మంగళవారం రఘునందన్ రావు మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికలతో తమ ప్రభుత్వానికి వచ్చేది లేదు.. పోయేది లేదు అంటున్న కాంగ్రెస్ నేతలు ఎందుకు పోటీ చేస్తున్నారని నిలదీశారు. కార్ రేస్ కేసులో నిందితులను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఏసీబీ రేవంత్ ప్రభుత్వం కంట్రోల్‌లో పని చేసేదే కదా అరెస్ట్ ఎందుకు చేయించడం లేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు అంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఒక్క ఆధారమైనా చూపించాలని ఛాలెంజ్ చేశారు. పాత సీఎస్ సోమేష్ కుమార్ వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని చెప్పిన వాళ్లు.. ఆయనను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. రింగురోడ్డు టోల్ గేట్ కుంభకోణంలో రేవంత్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని రఘునందన్ రావు ప్రశ్నించారు. అంతకుముందు సిద్దిపేట కొండా భూదేవి గార్డెన్‌లో కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ... బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలుపును ఎవరూ ఆపలేరని జోస్యం చెప్పారు. ఇద్దరు బీజేపీ అభ్యర్థులు మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలుస్తారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు. మిగతా పార్లమెంట్‌లలో కంటే మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎక్కువ ఓట్లు సాధిస్తామని అన్నారు. గతంలో గెలిచిన నాయకులు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ పంచన చేరారు, కానీ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని మండిపడ్డారు. ఇతర పార్టీలో నాయకులను కొన్నట్లుగా బీజేపీ పార్టీ నాయకులను కొనలేరని మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఉద్ఘాటించారు. బీసీలలో ముస్లింలను రేవంత్ రెడ్డి కలిపారని ఆరోపించారు. నూటికి 55శాతం బీసీలు ఉంటే వారికి ఉన్న వాటా ప్రకారం మంత్రి పదవులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎప్పుడు కూడా బీసీని ఎందుకు సీఎం చేయలేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. కేంద్రమంత్రి పదవుల్లో బీసీలకు మోదీ పెద్దపీట వేశారని చెప్పారు. ఒక్క మైనార్టీకి కూడా కాంగ్రెస్ మంత్రి పదవి ఇవ్వలేదని అన్నారు. తనకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఇద్దరు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదని చెప్పారు. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే ముందుగా ధామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు నిర్ణయించాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నిన్నటి సభలో బీజేపీ గెలుస్తుందని చెప్పకనే చెప్పారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 14నెలల్లోనే ప్రజల విశ్వాసాలను కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చి అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. తన కోసం మూడు రోజులు కష్టపడితే తాను ఆరేళ్లు మీ కోసం కష్టపడతా నిరుద్యోగులకు అండగా ఉంటానని మాటిచ్చారు. ఎమ్మెల్సీ జీతం నుంచి వచ్చే డబ్బులను పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి హామీ ఇచ్చారు.



# ట్రిలియన్ డాలర్ల ఆర్థికశక్తిగా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'రాబోయే 10 సంవత్సరాలలో తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకే పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను అందించే సంస్థలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోంది. మేము ఇంతకాలం ఉన్నత విద్యపై పెట్టుబడులు పెట్టాం. ఎందరో శాస్త్రవేత్తలు, శాస్త్ర, సాంకేతిక నిపుణులు, ఇంజినీర్ల సమూహాన్ని తయారు చేశాం. జీనోమ్ వ్యాలీని కూడా ఏర్పాటు చేసుకున్నాం. హైదరాబాద్ కోర్ అర్బన్ సిటీ ఏరియా సేవల రంగానికి ప్రాధాన్యమిస్తాం. హైదరాబాద్ లో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీతోపాటు ఎన్నో భారీ ప్రాజెక్టులు చేపడుతున్నాం. దేశంలో ఇప్పుడు హైదరాబాద్ ఎలక్ట్రిక్ వాహనాల రాజధానిగా అవతరించింది. దేశంలోనే అత్యధిక ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ఇక్కడే జరుగుతున్నాయి. 3,000 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెడుతున్నాం. కోర్ సిటీ వెలుపల ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకూ మాన్యుఫ్యాక్షరింగ్ హబ్‌ను అభివృద్ధి చేస్తాం. ప్రపంచంలోని అతిపెద్ద తయారీ కేంద్రాలలో ఒకటిగా దీన్ని నెలకొల్పుతాం. ప్రపంచం నలుమూలాల నుంచీ పెట్టుబడులను ఆహ్వానిస్తాం. ఓఆర్ఆర్.. ఆర్ఆర్ఆర్.. ఈ రెండు రింగ్‌లను రేడియల్ రోడ్లతో అనుసంధానిస్తాం. ఈ రహదారులకు ఇరువైపులా క్లస్టర్లను అభివృద్ధి చేస్తాం. తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం. ఒక మెగా డ్రై పోర్టును అభివృద్ధి చేసి ఏపీలోని సీ పోర్టుకు అనుసంధానించేందుకు ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా సదుపాయాలు మెరుగుపరుస్తాం. బయోసైన్సెస్, బయోటెక్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యావరణ వ్యవస్థకు చిరునామాగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధి, తయారీ, నైపుణ్యాల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రణాళికతో పని చేస్తున్నాం. నిన్ననే హైదరాబాద్‌లో ఆమ్జెన్ సంస్థ తమ కార్యకలాపాలను విస్తరించింది. ఇది మా సహకారానికి నిదర్శనం. తెలంగాణలో ఉన్న అనుకూలతలు, మా ప్రభుత్వ సహకారాన్ని అందుకోవాలని, మాతో భాగస్వామ్యం పంచుకోవాలని ప్రపంచస్థాయి దిగ్గజ కంపెనీలు అన్నింటినీ ఆహ్వానిస్తున్నాం. సులభమైన పారిశ్రామిక విధానం, మౌలిక సదుపాయాలు, ఆశించినంత మద్దతు అందించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. దేశ విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉంది. ఇక్కడ అత్యల్ప ద్రవ్యోల్బణం, అత్యధిక ఉద్యోగాల కల్పన ఉంది. ఇటీవల దావోస్ ప్రపంచ ఆర్థిక వేదికలోనూ తెలంగాణ రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. విభిన్న రంగాలలో దాదాపు 50,000 ఉద్యోగాలు రానున్నాయి. గతేడాది లైఫ్ సైన్సెస్ రంగంలోనూ రూ.40 వేల కోట్లకు పైగా పెట్టుబడులను విజయవంతంగా ఆకర్షించాం. దాదాపు 150పైగా ప్రాజెక్టుల్లో ఈ పెట్టుబడులు విస్తరించాయి. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ఫార్మా గ్రామాలు అభివృద్ధి చేస్తున్నాం. ఐదు లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించాలని ఆశిస్తున్నాం. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ కింద కీలకమైన గ్రీన్ ఫార్మా సిటీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. అతిపెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలు అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయి. జర్మన్ కంపెనీ మి÷-టలెని బయోటెక్ జీనోమ్ వ్యాలీలో తన సెల్, జన్యు చికిత్సను ప్రారంభించింది. ఈ వేదిక పైనుంచి మరో నాలుగు బహుళజాతి కంపెనీలను మా పర్యావరణ వ్యవస్థలోకి స్వాగతిస్తున్నాం. 25 సంవత్సరాల్లో ఫార్మా తయారీ, ఐటీ, డిజిటల్ హెల్త్ పవర్ హౌస్‌గా హైదరాబాద్ పేరు నిలుపుకుంది. గతేడాది ఏఐ హెల్త్‌కేర్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించాం. దేశవిదేశాల నుంచి బయో ఏషియా సదస్సుకు హాజరైన ప్రముఖుల గొప్ప మనస్సుకు అభినందనలు. మీరందరూ తెలంగాణను అనువైన వేదికగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నా. జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డ్ పొందిన ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని' చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క రోజే లక్ష రేషన్‌కార్డులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 25:** ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్తను అందించింది. గత పదేళ్లకు పైగా అన్ని అర్హతలు ఉన్న తెల్లరేషన్‌కార్డు లేకపోవడంతో అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు మార్చి ఒకటి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రకటించింది. మార్చి ఒకటిన ఒకే రోజు లక్ష కార్డులు జారీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో లక్ష కార్డులను అధికారులు పంపిణీ చేయనున్నారు. కొత్త జిల్లాల ప్రకారం.. హైదరాబాద్-285, వికారాబాద్ జిల్లా-22 వేలు, నాగర్‌కర్నూల్ జిల్లా-15 వేలు, నారాయణపేట జిల్లా-12 వేలు, వనపర్తి జిల్లా-6వేలు, మహబూబ్‌నగర్ జిల్లా-13 వేలు, గద్వాల్ జిల్లా-13 వేలు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా-6 వేలు, రంగారెడ్డి జిల్లా-24 వేలు చొప్పున లక్ష కార్డులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మార్చి 8 తర్వాత అన్ని జిల్లాల్లో పంపిణీ చేపట్టనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. కాగా, 2014 నుంచి తెలంగాణలో నూతన రేషన్ కార్డులు జారీ చేయలేదు. ఈ పదేళ్లలో లక్షల మంది వివాహాలు చేసుకుని వేరుకాపురాలు పెట్టారు. ప్రభుత్వ పథకాలు ఏమైనా అందాలంటే రేషన్ కార్డులు కీలకం. కార్డులు లేక అనేక మంది సంక్షేమ పథకాలను కోల్పోయిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు నూతన కార్డులు జారీ చేస్తున్నట్లు తీపి కబురు చెప్పింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది జనవరి 26న కూడా 16,900 కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేశారు. మరోసారి ఈ ప్రక్రియ చేపట్టి మరికొన్ని కుటుంబాలకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రజాపాలన, గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు.. తాజాగా మీ సేవా కేంద్రాల ద్వారా కూడా అప్లికేషన్లు తీసుకుంటున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం అర్హులకు కార్డులను మంజూరు చేయనున్నారు.



# సర్వశక్తులు ఒడ్డుతాం

**నల్లగొండ, ఫిబ్రవరి 25:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం చోటు చేసుకుని మూడు రోజులు గడుస్తుంది. టన్నెల్‌లో గల్లంతైన ఎనిమిది మంది ఆచూకీపై ఇంకా స్పష్టత లేదు. రెస్క్యూ టీమ్స్ పలుమార్లు టన్నెల్‌లోకి వెళ్లి ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో తిరిగి వచ్చాయి. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రెస్క్యూ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా తిరిగి తీసుకురావడానికి సర్వ శక్తులా ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో అత్యంత నిపుణులైన 10 ఏజెన్సీలు ఈ రెస్క్యూలో పనిచేస్తున్నాయి.. ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, జియాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ రిమోట్ సెన్సింగ్ అన్నీ కలిసి పనిచేస్తున్నాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ముఖ్యమంత్రి కూడా ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.. ప్రమాదం జరిగిన వెంటనే వేగంగా స్పందించామని మంత్రి పేర్కొ?న్నారు. ఇలాంటి ప్రమాదాల్లో రెస్క్యూ ఆపరేషన్స్ చేసే అనుభవం ఉన్న వాళ్ళను కూడా ఆహ్వానిస్తున్నాం.. మేము ఇంత చేస్తుంటే.. కొందరు చిల్లర రాజకీయం చేస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు. కాళేశ్వరంలో ఏడుగురు చనిపోతే మేము మాట్లాడలేదు.. శ్రీశైలం పవర్ ప్లాంట్ లో కూడా ఎనిమిది మంది చనిపోతే కూడా ఏనాడు మాట్లాడలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన ప్రమాదం దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు. దేశంలోనే గొప్ప ప్రాజెక్టు ఇది.. 45 కి.మీలలో 30 కి.మీ పూర్తి అయ్యిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు మినిమం సెన్స్ లేకుండా మాట్లాడుతున్నాయి.. ప్రాజెక్ట్ పూర్తి ఐతే నల్గొండ జిల్లాలో లక్షల ఎకరాలకు నీరు అందుతుంది.. ఫ్లోరైడ్ బాధ తొలుగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 10 ఏళ్ల పాటు ప్రాజెక్ట్ పనులు నిలిపివేశారని మంత్రి ఆరోపించారు. మరోవైపు.. టన్నెల్‌లో చిక్కుకున్న వారి ప్రాణాలు కాపాడటానికి సర్వ శక్తులా కృషి చేస్తున్నాం.. ప్రమాదం జరిగిన స్థలంలో నీరు లీక్ అవుతోంది.. నీటి ఉధృతి కూడా పెరిగిందని రెస్క్యూ టీమ్స్ చెప్తున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.

## ఎస్సీ వర్గీకరణకు
# త్వరలో చట్టబద్ధత

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 :** త్వరలోనే ఎస్సీ వర్గీకరణ చట్టం తేబోతున్నాం అని, వర్గీకరణలో ఎవరి వాట వాళ్లకు అందుతుందని మంత్రి దామోదర రాజనర్సిం హ తెలిపారు. సుప్రీంకోర్టు కోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే సభలో అమలుకు నిర్ణయం తీసుకోవడం మాములు విషయం కాదని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశంసించారు. మార్చి 3న రవీంద్ర భారతిలో మాదిగల కృతజ్ఞత సభ ఉంటుందని మంత్రి దామోదర తెలిపారు. బేగంపేటలోని హోటల్ హరిత ప్లాజాలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు మంత్రి దామోదర, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఎమ్మెల్యే వీరేశం హాజరయ్యారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన వారికి మంత్రి దామోదర రాజనర్సింహ నివాళులు అర్పించారు. వర్గీకరణలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబ సభ్యుల కాళ్లను మంత్రి కడిగారు. ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలకు ఐదు లక్షల ఆర్థిక సాయం అందించనున్న తెలిపారు. మంత్రి దామోదర మాట్లాడుతూ? 'వర్గీకరణ ఉద్యమం అసహనం, అభద్రతల నుండి వచ్చింది. పోరాటం ఎవరికి వ్యతిరేకం కాదు . వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన వారి త్యాగం జాతికి కనువిప్పు. ఉప కులాల అందరికీ న్యాయం జరగాలి. సుప్రీంకోర్టు కోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే సభలో అమలుకు నిర్ణయం తీసుకోవడం మాములు విషయం కాదు. ఆ నిబద్ధత సీఎం రేవంత్ రెడ్డికి ఉంది. ఎవరు ఎన్ని వంకలు పెట్టినా.. ఏక సభ కమిషన్ అద్భుతమైన నివేదిక ఇచ్చింది. 52 లక్షల జనాభా ఉంటే.. 33 కులాలు ముట్టుకోలేదు. త్వరలోనే వర్గీకరణ చట్టం తేబోతున్నాం. వర్గీకరణలో ఎవరి వాట వాళ్ళకు అందుతుంది. అందుకు రేవంత్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. అబద్దాలు, మోసం ఎక్కువ కాలం పని చేయవని అన్నారు. అమరవీరుల వల్లనే మాదిగల వర్గీకరణ సాధ్యమైందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి అందరం అండగా ఉండాలన్నారు. 30 ఏండ్లుగా ఎదురుచూస్తున్న వారి కల నిజం అవుతుందని, అమరవీరుల స్మారకం ఏర్పాటు చేయాలని మోత్కుపల్లి చెప్పుకొచ్చారు. మాదిగ, అనుబంధ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంస్మరణ సభ జరిగింది. కాలే యాదయ్య, తోట లక్ష్మీకాంతారావు, డాక్టర్ ఏ చంద్రశేఖర్, మాజీ శాసనసభ్యులు సంపత్ కుమార్, మాజీ ఎంపీ పసునూరు దయాకర్ సహా మాదిగ, మాదిగ అనుబంధ కులాల ముఖ్య నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్‌పై బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 25:** రాష్ట్రంలో బీఆర్ఎస్ లేకుండా బీజేపీ, కాంగ్రెస్‌లు కలిసి కుట్రలు పన్నుతున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కానీ వారు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల గుండెల్లో నిలిచేది బీఆర్ఎస్సే అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన మాజీ జడ్పిటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నేత మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల వివాహాలకు రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. రూ.15 వేలు రైతు భరోసా, రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తా అని మాయమాటలు చెప్పారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి 450 రోజులు అవుతుందని.. రోజుకు ఒకరి చొప్పున 450 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. భారతదేశంలో రైతు ఆత్మహత్యలు అత్యధికంగా తగ్గించింది కేసీఆర్ ప్రభుత్వం అని కేంద్రం పార్లమెంట్‌లో చెప్పిందని గుర్తు చేశారు. మరి కాలం తెచ్చిన కరువా..? కాంగ్రెస్ తెచ్చిన కరువా..? అర్థం చేసుకోవాలన్నారు. కేసీఆర్ మీద కోపంతోనే మేడిగడ్డ రిపేర్ చేయడం లేదని ఆరోపించారు. శివుడు గంగను కిందకు తీసుకువస్తే.. కేసీఆర్ గంగను పైకి తెచ్చిండని పేర్కొన్నారు. కానీ రైతులకు మాయమాటలు చెప్పి ఓట్లు కొల్లగొట్టారు అని కేటీఆర్ తెలిపారు. కాళేశ్వరంలో ఒక బ్యారేజ్‌లో ఒక పర్రె వడితే.. దానికి కాంగ్రెస్ నేతలతో పాటు మీడియా ప్రతినిధులు కూడా లొల్లి పెట్టిండ్రు. మరి ఇవాళ సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే ఎవరు మాట్లాడరు. కాంగ్రెస్, బీజేపోడు నోరెత్తడు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోతే మాట్లాడరు. ఖమ్మం వద్ద పెద్దవాగు కొట్టుకుపోతే ఎవరు మాట్లాడరు. రేవంత్ రెడ్డికి రక్షణ కవచంలా బీజేపీ ఉంది. కాళేశ్వరంలో ఒక పిల్లర్‌కు పర్రె వడితే.. ఎన్డీఎస్ఏ వాలిపోయింది. మరి ఇవాళ ఎస్ఎల్‌బీసీలో టన్నెల్ కూలి దాదాపు 72 గంటలు అవుతుంది మరి ఎందుకు ఎన్డీఎస్ఏ రాలేదు. ఏ బీజేపోడు మాట్లాడడు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడం లేదు. ఏం ఇబ్బంది వచ్చింది. సుంకిశాల కూలిపోతే గవినోళ్ల శ్రీనివాస్ ఆర్టీఐ కింద రఖాస్తు పెట్టుకుంటే.. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. సమాధానం ఇవ్వమని చెప్పారు అని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ రెండే కాదు.. ఎన్నికల ప్రచారంలో మోదీ వచ్చి.. కాంగ్రెస్ పార్టీ అవినీతి ప్రభుత్వాన్ని నడుపుతుంది.. ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని గర్జించిండు. కానీ ఇంత వరకు చర్య లేదు. రేవంత్ రెడ్డి బామ్మర్ది కంపెనీ శోధా 2 కోట్ల లాభం ఆర్జించింది. అమృత్ స్కీంలో రూ. 1137 కోట్ల కాంటాక్ట్ ఇచ్చిండు బామ్మర్ది కంపెనీకి రేవంత్ రెడ్డి. దీని మీద విచారణ చేయాలని సంబంధిత కేంద్రమంత్రికి ఫిర్యాదు చేశాం. ఆరు నెలలు అవుతంది.. ఇప్పటి వరకు స్పందన లేదు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ రైడ్ అయింది.. ఏం జరిగిందో తెలియదు కానీ ఇప్పటి వరకు ఎవరూ నోరు విప్పడం లేదు. ఇవన్నీ దేనికి సంకేతం.. ఎవరు ఎవర్ని కాపాడుతున్నారు. రేవంత్ రెడ్డి బీజేపీ మీద పల్లెత్తు మాట మాట్లాడం లేదు. కేసీఆర్ మీదనే మాట్లాడుతున్నడు. ఈ రాష్ట్రంలో కేసీఆర్ పార్టీ ఉంటే.. కాంగ్రెస్, బీజేపీ ఆటలు సాగవని తెలుసు కాబట్టి.. ఆ ఇద్దరు కలిసి కేసీఆర్ పార్టీని ఖతం చేయాలన్నదే ఆలోచన. అసెంబ్లీ ఎన్నికల్లో కుమ్మక్కై సక్సెస్ అయ్యారని కేటీఆర్ తెలిపారు.

## రాష్ట్రంలో వ్యవసాయ అత్యవసర పరిస్థితి ప్రకటించాలి

గడచిన 48 గంటల్లో రాష్ట్రంలో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రాష్ట్రంలో వ్యవసాయ అత్యవసర పరిస్థితి ప్రకటించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. ఎస్ఎల్‌బీసీ వద్ద ప్రమాదం జరిగి ఎనిమిది మంది కార్మికులు సొరంగంలో చిక్కుకున్నారని, రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితులు ఉంటే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారని, గాల్లో చక్కర్లు కొడుతున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు 35 సార్లు ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి చేసిందేమిటి.. తాజాగా 36వ సారి వెళ్లి చేసేదేమిటని ప్రశ్నించారు. కనీసం మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. అధికార పార్టీని వదిలిపెట్టి ప్రతిపక్ష పార్టీలో.. హస్తం నేతలు, కార్యకర్తలు చేరుతున్నారంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చని కేటీఆర్ అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన నేతలు, కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గులాబీ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి, సంక్షేమ శాఖ మంత్రి లేరని ఆక్షేపించారు. భారాసకు ఓటు ఎందుకు వేయలేదా అని ప్రజలు ఇప్పుడు బాధ పడుతున్నారన్న కేటీఆర్... రేవంత్ రెడ్డిని చూసిన తర్వాతే కేసీఆర్ విలువ తెలుస్తోందని అన్నారు. ప్రజలు పునరాలోచనలో పడ్డారని, మళ్లీ బిఆర్ఎస్‌దే అధికారం ఖాయమని అన్నారు.



# అంబర్‌పేట ఫ్లైఓవర్ పూర్తి

### పండుగ రోజే రాకపోకలు.. పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి..

హైదరాబాద్, ఫిబ్రవరి 25: హైదరాబాద్‌వాసులకు మహా శివరాత్రి కానుక అందించనున్నట్టు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. నగరంలో కొన్నేళ్లుగా నిర్మాణ దశలో ఉన్న అంబర్‌పేట ఫ్లైఓవర్ ఎట్టకేలకు పూర్తయిన నేపథ్యంలో.. బుధవారం నుంచి అందుబాటులోకి రానున్నట్టు కిషన్ రెడ్డి ప్రకటించారు. అంబర్ పేట ఫ్లైఓవర్‌పై రేపటి నుంచి రాకపోకలు ప్రారంభించనున్నట్టు తెలిపారు. మంగళవారం ఉదయం అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను కిషన్ రెడ్డి పరిశీలించారు. గోల్నాక నుంచి అంబర్‌పేట ఇరానీ హోటల్ వరకు ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించిన విషయం తెలిసిందే. అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. చాదర్‌ఘట్ నుంచి వరంగల్ వెళ్లే జాతీయ రహదారికి.. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రోడ్డు విస్తరణ చేశారని.. కానీ అంబర్‌పేట ఛే నెంబర్ వద్ద రెండు వైపులా శ్మశాన వాటిక ఉండటం వల్ల రోడ్డు విస్తరణ కుదరలేదని తెలిపారు. తాను అంబర్ పేట శాసనసభ్యుడిగా, ఎంపీగా చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి.. శ్మశాన వాటిక ఉన్నందున ఫ్లైఓవర్ నిర్మాణం చేయాలని కోరానని చెప్పుకొచ్చారు. ఈ మార్గంలో విపరీతమైన రద్దీ ఉంటుందని.. స్థానిక ప్రజలు కూడా నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతుంటారని తెలిపారు. ఈ జాతీయ రహదారి గుండా వెళ్లే వరంగల్, ఖమ్మం ప్రజలు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఫ్లైఓవర్ మంజూరు చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని అడగ్గా.. ఆయన వెంటనే ఒప్పుకొని మంజూరు చేశారని కిషన్ రెడ్డి తెలిపారు. మరోవైపు.. ఫ్లైఓవర్ కింద రెండు వైపులా స్మశాన వాటికలు ఉండటం వల్ల.. రోడ్డు విస్తరణ ఇబ్బందిగా మారిందని కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భూసేకరణ పూర్తి చేయాలని కోరారు. అంబర్‌పేట ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చి మిగతా ఐదు చోట్ల భూసేకరణ చేసి రోడ్డు విస్తరణకు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకచోట భూసేకరణకు సంబంధించి రూ.2 కోట్ల 51 లక్షలు చెక్కు తీసుకున్న తర్వాత కూడా స్థలం నేషనల్ హైవే అథారిటికి అప్పగించలేదని గుర్తుచేశారు. దాన్ని త్వరగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కిషన్ రెడ్డి కోరారు. జీహెచ్ఎంసీ, నేషనల్ హైవే అధికారులతో ఇటీవల తాను ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్టు కిషన్ రెడ్డి తెలిపారు. ఫ్లైఓవర్ కింద మంచి రోడ్డు వేయడంతో పాటు, గ్రీనరీ, బ్యూటిఫికేషన్ చేయాలని అధికారులను సూచించినట్టు తెలిపారు. అయితే.. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా సాధ్యం కాదని చెప్పారని వెల్లడించారు. ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసి ట్రాఫిక్‌ను పైనుంచి పంపిస్తూ.. కింద రోడ్డు, బ్యూటిఫికేషన్ పనులు చేయాలని అధికారులకు సూచించినట్టు వివరించారు. కాబట్టి మిగిలిపోయిన చోట్ల కూడా రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసి నేషనల్ హైవే అథారిటికి అప్పగిస్తే ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారు. ఈ శివరాత్రి నుంచి ఫ్లైఓవర్ మీనుంచి ట్రాఫిక్ వదిలి.. కింద రోడ్డు నిర్మాణం, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ ఫ్లైఓవర్కు సంబంధించి తాను గతంలో కేసీఆర్‌కు, ఇప్పుడు రేవంత్ రెడ్డికి అనేక ఉత్తరాలు రాసినట్టు తెలిపారు. భూసేకరణను వేగవంతం చేయాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశానన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి.. మిగిలిపోయిన ఆరు చోట్ల భూసేకరణను చేపట్టాలని కోరారు. ఈ ఫ్లైఓవర్ కోసం ఇప్పటి వరకు రూ.338 కోట్లు ఖర్చు చేసినట్టు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ట్రాఫిక్ కష్టాలకు శివరాత్రితో కొంత ఉపశమనం కలుగుతుందని కిషన్ రెడ్డి తెలిపారు.

# పట్టభద్రులకు మీరేం చేశారు

- మత రాజకీయాలు తప్ప బీజేపీకి ఏమీ చేతకాదు
- ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలమాట ఏమైంది..?
- చెప్పుకోవటానికి ఒక్కటైనా ఉందా..?
- మతం పేరు లేకుండా బండి ఒక్కమాట మాట్లాడలేడు : సీతక్క



**హైదరాబాద్, ఫిబ్రవరి 25:** మత రాజకీయాలు తప్ప బీజేపీకీ ఏమీ చేతకాదని మంత్రి సీతక్క అన్నారు. బీజేపీ టీం ఇండియా, కాంగ్రెస్ పాకిస్తాన్ అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాలుగా యువకులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఒకటి కూడా బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పి జిల్లాకు 200 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు యువకులకు జవాబు చెప్పుకోక మత రాజకీయాలకు బండి సంజయ్ పాల్పడుతున్నారని ఆగ్రహించారు. చెప్పుకోవడానికి అభివృద్ధి లేదని.. సబ్జెక్టు అంతకన్నా లేదన్నారు. అందుకే బండి సంజయ్ నోరు తెరిస్తే హిందూస్తాన్, పాకిస్తాన్, హిందూ, ముస్లిం తప్ప మరో మాట తెలియదని విరుచుకుపడ్డారు. 'సూటిగా బండి సంజయ్‌ను అడుగుతున్నా... పట్టభద్రులకు మీరేం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు? ఎంత ఉపాధి కల్పించారు? ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మారు. ప్రైవేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారు. దేవుని పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ... దేవునికి వినియోగించే అగర్బత్తిల మీద కూడా జీఎస్టీ వేసింది. ఉన్నత విద్య మీద 18% జీఎస్టీ విధిస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతుంది. అలాంటి బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదు. తెలంగాణ విభజన హామీలు అమలు కాలేదు. ఎన్నికలప్పుడే హిందూ ముస్లిం అని రెచ్చగొడతారు. బండి సంజయ్.. పాకిస్తాన్‌తో పోల్చి భారతదేశం గొప్పతనాన్ని తగ్గించొద్దు. పాకిస్తాన్‌తో పోల్చి దేశాన్ని కించపరచడం తప్ప మీరు దేశానికి చేసింది లేదు. దమ్ముంటే అభివృద్ధి ప్రాతిపదికన ఎన్నికల్లోకి రండి" అంటూ సవాల్ విసిరారు. ట్రైబల్ యూనివర్సిటీ పనులు కూడా మొదలుపెట్టలేనీ అసమర్థ కేంద్ర ప్రభుత్వం అంటూ విమర్శించారు. బండి సంజయ్‌కు చెప్పుకోవడానికి ఏం లేదని.. మాట్లాడడానికి రెండు మాటలు రావన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేయాలనుకుంటే.. భారత సరిహద్దుల్లో ఉన్న సైనికుల మాదిరిగా యుద్ధంలో పాల్గొనాలని ఉచిత సలహా ఇచ్చారు. ఆకలి చావులు అంతర్గత సమస్యలతో దివాలా తీసిన పాకిస్తాన్‌తో పోల్చి.. దేశాన్ని అవమానపర్చవద్దన్నారు. పాకిస్తాన్‌తో పోల్చి దేశ గౌరవాన్ని బండి తగ్గిస్తున్నారని.. దేశ గౌరవాన్ని తగ్గిస్తున్న బండి సంజయ్‌ను బీజేపీ పెద్దలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. "భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన భారతీయులంతా నా సోదరులే అన్న మీరు భారత రాజ్యాంగాన్ని కాపాడతానని చెప్పిన మీరు.. అధికారం కోసం విద్వేష ప్రసంగాల అవసరమా. మీరు చేసింది శూన్యం. పట్టభద్రులారా ఆలోచించండి విద్యా వేత్త నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించండి. సంవత్సరకాలంలో 54 వేల ఉద్యోగాలు ఇచ్చాం. నరేందర్ రెడ్డిని గెలిపించి పనిచేసే ప్రభుత్వాన్ని సపోర్ట్ చేయండి. భావోద్వేగాలతో రాజకీయాలు చేసే బండి సంజయ్‌కు, బీజేపీకి గట్టిగా బుద్ధి చెప్పండి" అంటూ పిలుపునిచ్చారు. యువతను మత కొట్లాట వైపు మళ్లించి కేసులు నమోదు చేయించడమే బీజేపీ రాజకీయం చేస్తోందన్నారు. టీఆర్ఎస్, బీజేపీ దొందూ దొందే అని అన్నారు. జటిలమైనా ఎన్నో సమస్యలను పరిష్కరించిన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని స్పష్టం చేశారు. భారతదేశంలో యుద్ధ వాతావరణం సృష్టించే ప్రయత్నం మానుకోవాలని.. ఈ చిల్లర మాటలు మానేయాలని హితవుపలికారు. ఇలాంటి విద్వేషపూరిత ప్రసంగాలు భారతీయుల ఐక్యతను దెబ్బతీస్తుందన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడ్డ పాకిస్తాన్‌తో భారతదేశాన్ని పోల్చి దేశ గౌరవాన్ని కించపరుస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి చెందిన దేశాలతో మనం పోల్చుకోవాలని మంత్రి సతీక్క వ్యాఖ్యలు చేశారు.

# నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వ్యాఖ్య



**జగిత్యాల,ఫిబ్రవరి 25 :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు తరఫున మండలిలో ప్రశ్నించే గొంతుగా అందరి సమస్యలు చర్చకు తీసుకు వచ్చానని ఎమ్మెల్సీగా పదవి ముగిసి జీవన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా నా బాధ్యత కర్తవ్యం నెరవేర్చిన సంతృప్తి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. శాసన మండలిలో కాంగ్రెస్ పార్టీ ఏకైక సభ్యుడిగా అత్యధిక సమయాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. 2019 కు ముందు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కోసం బరిలో నిలిస్తే రాజకీయాలకు అతీతంగా అండగా నిలిచారని, అని, సిట్టింగ్ ఎమ్మెల్సీ గా మళ్ళీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని భావించడం సహజమని, అసెంబ్లీ ఎమ్మెల్యే ఎన్నికల్లో ఆశించిన ఫలితం పొందలేదు , ఎంపీ ఎన్నికల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టి బీజేపీ గెలుపొందడం నిరాశ కు గురిచేయడంతో ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపలేదన్నారు. ఉత్తర తెలంగాణ విద్యా వేత్త నరేందర్ రెడ్డి.. పరిచయం అవరసం లేని వ్యక్తి అని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనలో అర్హత కల్పించడంలో లక్ష మందిని తీర్చిదిద్దిన ఘనత నరేందర్ రెడ్డి కి దక్కుతుందన్నారు. తెలంగాణ ఉద్యమం నిధులు, నీళ్ళు, నియామకాల కోసం కొనసాగిందని, ఉద్యమ సారథిగా కేసీఆర్‌కు రెండుసార్లు అవకాశం ఇస్తే ఉద్యోగాలు కల్పించడంలో కేసీఆర్ విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. నిరుద్యోగులు మార్పులు కోరడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఒక సంవత్సర కాలంలో 56 వేల ఉద్యోగాలు కల్పించామన్నారు. మూడేళ్ళలో 50వేల ఉద్యోగాలు భర్తీ చేసినం అని ప్రచారం చేసుకున్నారని, సీఎం రేవంత్ రెడ్డి పాలనలో దేశంలో ఎక్కడ లేని విధంగా ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. 2008 డీఎస్సీ కోర్టు ఉత్తర్వులు వచ్చిన గత ప్రభుత్వం అమలు చేయలేదని, ఉద్యోగాల ఖాళీల భర్తీ కి అనుగుణంగా ఉద్యోగాలు భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండర్ ప్రకటించామన్నారు జీవన్ రెడ్డి. అంతేకాకుండా.. స్వయం ఉపాధి తో పాటు ఉద్యోగాల కల్పనలో భాగంగా ఉద్యోగాల నైపుణ్య పెంపు కోసం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ప్రశ్నించే గొంతుగ మారిన. పట్టభద్రులకు ప్రభుత్వానికి వారధిగా పని చేస్తారని నరేందర్ రెడ్డి అవకాశం కల్పించారు. నరేందర్ రెడ్డి గెలుపు కోసం అందరూ కృషి చేయాలి. నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోరారు. అనంతరం అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ హైకమండ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు బలపరిచిన నరేందర్ రెడ్డి గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలి. యువతను ఆదుకునేందుకు నరేంద్ర మోడీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నిరుద్యోగులకు ఇచ్చిన మాట మరిచింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 56 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చినం. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా నియామక ఉత్తర్వులు అందజేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు వేతనం ఇవ్వడంలో జాప్యం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఒకటో తారీఖు నాడు వేతనాలు ఇస్తున్నాం. పట్టభద్రులు రాజకీయాలకు అతీతంగా జీవన్ రెడ్డి నీ గెలిపించారు అని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టి, పట్టభద్రుల పక్షాన నిలిచారు. జీవన్ రెడ్డి స్థానంలో నరేందర్ రెడ్డి కి పట్టభద్రుల ఎమ్మెల్సీ గా అవకాశం కల్పించిన నేపథ్యంలో కరీంనగర్ ముద్దు బిడ్డ నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని' పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు.

# వేసవి రాకముందే నీటికష్టాలు

### కాంగ్రెస్ పాలనలో గడ్డుకాలం తప్పదు : హరీశ్‌రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 25:** కేసీఆర్ పాలనలో హైదరాబాద్ నగరంలో ఏ ఒక్కరోజు కూడా నీటి కష్టాల్లేవని.. కానీ ఇవాళ ఎండాకాలం రాకముందే.. నీళ్ల కష్టాలు మొదలయ్యాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే హైదరాబాద్‌లో తాగునీటి కష్టాలు మొలయ్యాయని హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. వేసవి రాకముందే బోర్లు ఎండిపోతున్నాయి. ప్రజలు డబ్బులు పెట్టి వాటర్ ట్యాంకర్లు తెప్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంతకు ముందెప్పుడూ హైదరాబాద్‌లో ఇలాంటి తాగునీటి సంక్షోభం రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదికే పరిస్థితి విషమించింది. దేశంలోనే భూగర్భ జలాలు భారీగా క్షీణించిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది. సామాన్యులు నీటి ట్యాంకర్ల కోసం భారీగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అని ఊదరగొట్టుకోవడం సిగ్గుచేటు. బీఆర్ఎస్ హయాంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించాం. మిషన్ కాకతీయతో చెరువులను పునరుద్ధరించాం. ఎండాకాలంలో కూడా చెరువులు మత్తడులు దుంకినయి. కాంగ్రెస్ పాలనలో చెరువులు ఎండిపోతున్నాయి. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారంలో మునిగిపోయింది. పాలనపై శ్రద్ధ పెట్టకుండా రాజకీయ కక్ష సాధింపు చర్యలలో బిజీగా ఉన్నారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.



# చారిత్రక ఘట్టంగా మహాకుంభమేళా

భారతదేశంలో మహోజ్వల ఘట్టం ముగింపు దశకు చేరుకుంది. 144 ఏళ్లకోమారు వచ్చే మహాకుంభమేళా మహాశివరాత్రి పర్వదినంతో ముగియనుంది. ఇప్పటికే 65కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి నట్లు యూపి ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయి. శివరాత్రి బుధవారం మరింతమంది చేరితే అసలు లెక్కలు తేలుతాయి. అయితే పవిత్ర స్నానాలు ఆచరించిన వారి సంఖ్యను చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ఈ జనాభా భారత జనాభాకు సగంగా ఉండడం విశేషం. దేశవిదేశాల నుంచి కూడా కోట్లాది సంఖ్యలో భక్తులు వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు, సిఎ యోగి ఆదిత్యనాథ్, ఎపి మంత్రులు పవన్ కళ్యాణ్, లోకేవ్ దంపతులు ఇలా ఒక్కరేమిటి ఎందరో విఐపిలు పుణ్యస్నానాలు ఆచరించారు. స్వల్ప ఘటనలు మినహా ఓ రకంగా కుంభమేళా అద్భుతంగా సాగిందనే చెప్పాలి. మౌని అమావాస్య రోజు జరిగిన తొక్కిసలాట ఒక్కటే కొంత ఆందోళనకు గురిచేసింది. రెండుమూడు చిన్నచిన్న ఘటనలు..అంటే స్వల్ప అగ్నిప్రమాదాల్లాంటివి జరిగాయి. ఇవి మినహా అంతా ప్రశాంతంగా ముగిసింది. ఇందుకు యూపి ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే. దాదాపు రెండేళ్ల ముందునుంచే ఈ మహాఘట్టం కోసం ఏర్పాట్లు మొదలయ్యాయంటే .. ఎంతగా జాగ్రత్తలు తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా ఇక చివరిదశకు చేరింది. ఇవరాత్రి పర్వదిన స్నానాలతో ఈ మహాకుంభమేళా ముగియనుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివెళ్తున్నారు. చివరి అమృత్ స్నానం కోసం కోటి మందికిపైగా భక్తులు వస్తారని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగానే ప్రయాగ్‌రాజ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. భద్రతా ఏర్పాట్లు మరింత పటిష్టం చేశారు. భక్తుల స్నానాలకు ఇబ్బందులు లేకుండా తొక్కిసలాటకు అవకాశం లేకుండా గట్టి ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి కుంభమేళా ప్రాంతాన్ని 'నో వెహికల్ జోన్' గా అధికారులు ప్రకటించారు. ప్రయాగ్‌రాజ్ మొత్తం ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. అత్యవసర, నిత్యావసర సర్వీసులకు చెందిన వాహనాలను మాత్రమే అనుమతించనున్నట్లు ప్రకటించారు. యాత్రికులంతా ఈ మార్గదర్శకాలను పాటించాలని, అధికారులకు సహకరించాలని ప్రభుత్వం కోరింది. చివరి రోజు అమృత స్నానాల కోసం కోటి మందికిపైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుంభమేళా ప్రాంతంలో రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా లక్నో, ప్రతాప్‌గఢ్ వైపు నుంచి వచ్చే యాత్రికుల కోసం ఫాఫామౌ ఘాట్‌ను నియమించారు. రేవాన్, బండా, చిత్రకూట్, మిర్జాపూర్ వైపు నుంచి వచ్చే వారికోసం ఆరైల్ ఘాట్‌ను రిజర్వ్ చేశారు. కౌశాంబి నుంచి వచ్చే భక్తుల కోసం సంగం ఘాట్‌ను కేటాయించారు. మరోవైపు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే అన్ని ప్రధాన రహదారుల్లో పోలీసులు భారీగా మోహరించారు. వాహనాలు సాఫీగా ముందుకు సాగేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే.. 40 పోలీసు బృందాలు మోటార్‌బైక్‌లపై ఆయా మార్గాల్లో మోహరించారు. ప్రయాగ్‌రాజ్‌ను కలిపే ఏడు ప్రధాన రహదారుల్లో అదనపు డైరెక్టర్ జనరల్, ఇన్‌స్పెక్టర్ జనరల్ స్థాయి అధికారులు విధుల్లో ఉండనున్నారు. కాగా, పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13న ప్రారంభమైన ఈ మహాకుంభమేళా.. ఫిబ్రవరి 26న శివరాత్రితో ముగియనుంది. దాదాపు 45 రోజుల పాటు సాగే ఈ కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కోట్లాదిగా తరలివస్తున్నారు. అక్కడ గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమం (ఃసతిలౖనితి ఃాజీనిణజీప)లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 64 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమంలో స్నానాలు ఆచరించినట్లు యూపీ సర్కార్ ప్రకటించింది. ఇక చివరి రోజు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఇదే సమయంలో గిన్నిస్ రికార్డు లక్ష్యంగా పారిశుద్ధ్య కార్మికులు కుంభమేళా ప్రాంతంలో క్లీన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 15,000 మంది పారిశుధ్య కార్మికులు ఇక్కడ నాలుగు జోన్లలో క్లీన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా చీపురుపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు, ప్రయాగ్‌రాజ్ మేయర్ గణేశ్ కేసర్వాని, మహాకుంభ్ ప్రత్యేక ఈవో ఆకాంక్ష రాణా పర్యవేక్షించారు. ఈ రికార్డుకు సంబంధించిన వివరాలను మూడు రోజుల్లో వెల్లడించనున్నట్లు గిన్నిస్ రికార్డు ప్రతినిధులు తెలిపారు. 2019లో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళా లో 10 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు పాల్గొని గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ రికార్డును బ్రేక్ చేయబోతున్నారు. పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13న ప్రారంభమైన ఈ మహాకుంభమేళా.. ఫిబ్రవరి 26న శివరాత్రితో ముగియ నుంది. దాదాపు 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కోట్లాదిగా తరలివచ్చారు. అక్కడ గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 63 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమ స్నానం ఆచరించారు. శివరిత్రి చివరిరోజుతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. మొత్తంగా మహాకుంభ మేళాతో ప్రపంచం దృష్టిని భారత్ ఆకర్శించిందనడంలో సందేహం లేదు.

# రైతు పొలంలో నోట్ల కట్టాలు?



నల్లగొండ, ఫిబ్రవరి 25 : రోజుమాదిరిగానే పొలంలోకి వెళ్లిన రైతు ఒక్కసారిగా అక్కడ నోట్ల కట్టలు ప్రత్యక్షమవ్వటంతో ఒక్కసారి షాక్‌కు గురయ్యాడు. ఇన్నీ రోజులు పడ్డ కష్టాలు ఈ డబ్బులతో తీరిపోతాయని ఆశపడ్డాడు.. కానీ చివరకు అవి అసలు నోట్లు కాదు.. నకిలీ నోట్లని తేలడంలో ఆ రైతు ఆశలు కాస్త ఆవిరయ్యాయి. ఈ ఘటన నల్గొండ జిల్లా దామరచర్ల మండలం పొత్తలపాలెం వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఓ రైతు మంగళవారం ఉదయం తన పంట పొలానికి బయల్దేరాడు. నార్కట్‌పల్లి-అద్దంకి రోడ్డు వెంట తన దాయాది పొలంలోసుమారు 40 వరకు రూ.500 నోట్ల కట్టలు పేర్చి ఉన్న సంచిని గుర్తించాడు. అందులో ఉన్న డబ్బును మరో రైతుతో కలిసి పరిశీలించి చూడగా.. అవి నకిలీ నోట్లను తేలింది. విషయం పోలీసుల వరకూ వెళ్లడంతో మిర్యాలగూడ గ్రామీణ సీఐ ఘటనా స్థలానికి చేరుకున్నాడు. పొలంలోని రూ. 500 నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫేక్ కరెన్సీపై 'చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అని ముద్రించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అవన్నీ ఫేక్ కరెన్సీ అని పోలీసులు వెల్లడించారు. అసలు ఈ నోట్లు అక్కడికి ఎలా వచ్చాయనే కోణంలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. విచారణ తర్వాత వాటిని అక్కడ ఎవరు పడేశారు? ఎందుకు వినియోగిస్తున్నారనే విషయాలు తెలుతాయని పోలీసులు తెలిపారు.

# హైదరాబాద్‌లో డేంజర్ బెల్స్

గాలిలో తగ్గుతున్న నాణ్యత ప్రమాణాలు

- 24న ఏకంగా 431 ఏక్యూఐ నమోదు
- సనత్‌నగర్‌లో పరిస్థితులు మరీ దారుణం



హైదరాబాద్, ఫిబ్రవరి 25: హైదరాబాద్ డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యంతో.. పరిస్థితి ఆందోళనకరంగా మారగా.. ఇప్పుడు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోనూ ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా.. సనత్‌నగర్‌లో పరిస్థితులు మరీ దారుణంగా మారాయి. సనత్‌నగర్‌లోని ఎయిర్ క్వాలిటీ ప్రమాదకర స్థాయికి చేరుకుంది. సోమవారం (ఫిబ్రవరి 24న) రోజున ఏకంగా 431 ఏక్యూఐ నమోదైంది. సోమవారం మధ్యాహ్నం 3.05 గంటల ప్రాంతంలో ఈ వ్యాల్యూ నమోదైనట్టు పేర్కొన్న టీటీపీసీబీ అధికారులు.. క్రమంగా ఈ లెవెల్స్ తగ్గుతూ వచ్చినట్టు తెలిపారు. మరోవైపు.. నగరంలో సగటున 108 ఏక్యూఐ నమోదైనట్టు అధికారులు తెలిపారు. మరోవైపు.. జూపార్క్‌లో 135, పటాన్ చెరువులో 112 తప్ప గ్రేటర్లో గాలి నాణ్యతను సూచించే 14 స్టేషన్లలో ఎక్కడా 100 ఏక్యూఐ దాటలేదని అధికారులు స్పష్టం చేశారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్లో గాలి నాణ్యత 0 నుంచి 50లోపు నమోదైతే ఆ గాలి స్వచ్ఛంగా ఉన్నట్టని.. అదే 51 నుంచి 100 వరకు ఉంటే గాలి నాణ్యత సంతృప్తికర స్థాయిలో ఉందని తెలిపిన అధికారులు.. 101 నుంచి 200 మధ్య ఉంటే కాస్త అనారోగ్యకరమని, 200 నుంచి 300 వరకు ఉంటే పూర్ క్వాలిటీ అని, 301 నుంచి 400 వరకు ఉంటే వెరీ పూర్ క్వాలిటీ అని పేర్కొన్నారు. ఇక.. 401 నుంచి 500 వరకు ఉంటే మాత్రం అది అత్యంత ప్రమాదకర స్థాయి అని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో.. సోమవారం సనత్నగర్లో 431 ఏక్యూఐ నమోదు కావటం కాస్త ఆందోళన కలిగించే అంశంగా అధికారులు పేర్కొన్నారు. గతేడాది.. నవంబర్ 25వ తేదీన సనత్నగర్లో 298, డిసెంబర్లో 229, జనవరిలో 171 ఏక్యూఐ నమోదైంది. అయితే.. సనత్ నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతం కావడంతో అక్కడ సాధారణంగానే అసాధారణ వ్యాల్యూస్ నమోదవుతుంటాయని అధికారులు తెలిపారు. అయితే.. ఎప్పుడూ లేనంతగా సోమవారం రోజున ప్రమాదకర స్థాయిలో వ్యాల్యూస్ నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇదిలా ఉంటే.. హైదరాబాద్లోని సనత్ నగర్లో ఎయిర్ క్వాలిటీ లెక్కించే మీటర్ పక్కన.. రెండు కంపెనీలకు చెందిన జనరేటర్లు ఉన్నాయని టీజీ పీసీబీ సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్ తెలిపారు. ఒక్కోసారి గాలి ఎక్కువ వీచినప్పుడు ఎయిర్ క్వాలిటీ లెవల్స్ పడిపోతుంటాయని చెప్పుకొచ్చారు. జనరేటర్ల కారణంగానే సోమవారం మధ్యాహ్నం 431 ఏక్యూఐ నమోదై ఉండొచ్చని.. దానికి భయపడాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. కాగా.. సనత్నగర్లో ఉన్న మీటర్ను అక్కడి నుంచి మారుస్తామని ప్రసాద్ తెలిపారు.

# హైదరాబాద్ కేంద్రంగా చికున్ గున్యా వ్యాక్సిన్ తయారీ

- బవేరియన్‌నార్డిక్‌కంపెనీతో బయోలాజికల్‌ఈ ఫార్మా ఒప్పందం
- కొత్తగా 300 మందికి ఉద్యోగ అవకాశం



**హైదరాబాద్, ఫిబ్రవరి 25:** చికెన్ గున్యా వ్యాధి నివారణ కోసం బయోలాజికల్–ఈఫార్మా బవేరియన్ నార్డిక్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నది. పేద, మధ్య తరగతి ఆదాయం ఉన్న దేశాలకు.. చికెన్ గున్యా వ్యాక్సిన్‌ను అందించాలన్న ఉద్దేశంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. బవేరియన్ కంపెనీతో కుదిరిన వ్యూహాత్మక ఒప్పందంపై .. హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్ కంపెనీ పత్రికా ప్రకటనలో పేర్కొన్నది. ఒప్పందంలో భాగంగా తొలుత టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ జరగనున్నది. ఆ తర్వాత వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రక్రియ జరుగుతుంది. దిగువ, మధ్య ఆదాయ దేశాలకు వ్యాక్సిన్ సరఫరా చేయాలన్న టార్గెట్‌తో రెండు ఫార్మాల కంపెనీలు డీల్ చేసుకున్నాయి. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ తర్వాత.. రెగ్యులేటరీ ఆమోదం కోసం కంపెనీ ప్రయత్నించనున్నది. ఆ తర్వాత కమర్షియల్‌గా చికెన్ గున్యా వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో ఉన్న ఉత్పత్తి కేంద్రంలోనే వ్యాక్సిన్ తయారీ జరగనున్నది. బయోలాజికల్–ఈ సంస్థ దీని ద్వారా కొత్తగా 300 కొత్త ఉద్యోగాలను కల్పించనున్నది. చికెన్ గున్యా వ్యాక్సిన్‌ను ప్రపంచ దేశాలకు అందించాలన్న ఉద్దేశంతో ప్రాజెక్టును చేపట్టినట్లు బీఈ వెల్లడించింది. అమెరికాలో చికున్ గునియా వ్యాక్సిన్‌కు ఆమోదం దక్కింది. 12 ఏళ్ల వయసు పిల్లలు కూడా అక్కడ ఆ వ్యాక్సిన్ ఇస్తున్నారు. బవేరియన్ నార్డిక్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉన్నట్లు బయోలాజికల్ ఈ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహిమా ధాట్ల తెలిపారు. దిగువ, మధ్య ఆదాయ దేశాల ప్రజలకు చికెన్ గున్యా వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. వ్యాక్సిన్ ఉత్పత్తి విధానం, సక్సెస్‌ఫుల్ ట్రాక్ రికార్డు వల్ల.. బవేరియన్ నార్డిక్ కంపెనీతో ఒప్పందం కుదర్చినట్లు ఆమె తెలిపారు. తమ కంపెనీ వద్ద ఉన్న అడ్వాన్స్‌డ్, నిష్ణాత తయారీ టెక్నాలజీతో.. పేద దేశాల ప్రజలకు వ్యాక్సిన్‌ను అందించనున్నట్లు ఆమె వెల్లడించారు. తమ ప్రయత్నం ద్వారా ప్రపంచవ్యాప్తంగా చికెన్ గున్యా వ్యాధి నియంత్రణలోకి వస్తుందని, తద్వారా ప్రజా ఆరోగ్య వ్యవస్థ బలపడుతుందని ఆశిస్తున్నట్లు మహిమ పేర్కొన్నారు. చికెన్ గున్యా వ్యాక్సిన్‌కు గ్లోబల్ యాక్సెస్ దక్కేందుకు.. బీఈతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు బవేరియన్ నార్డిక్ కంపెనీ సీఈవో పాల్ చాప్లిన్ తెలిపారు. చిక్ వీఎల్‌పీ పేరుతో వ్యాక్సిన్ రూపొందిస్తున్నారు. దీన్నే వీఎల్పీ రికాంబినాంట్ ప్రోటీన్ వ్యాక్సిన్‌గా పిలుస్తారు. చికెన్ గున్యా వైరస్‌ను ఆ ప్రోటీన్ వ్యాక్సిన్ అదుపులోకి తీసుకువస్తుంది. 12 ఏళ్లు దాటిన వారికి ఈ వ్యాక్సిన్ ఇస్తారు.

# సిక్కుల ఊచకోత కేసులో సజ్జన్‌కు జీవిత ఖైదు

## శిక్షను ఖరారు చేసిన ప్రత్యేక కోర్టు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ మాజీ నేత సజ్జన్‌కుమార్‌కు ప్రత్యేక కోర్టు మంగళవారం జీవితఖైదు విధించింది. ఫిబ్రవరి 12న కోర్టు సజ్జన్ కుమార్‌ను దోషిగా నిర్ధారించింది. అతని శారీరక, మానసిక ఆరోగ్యంపై నివేదిక సమర్పించాల్సిందిగా తీహార్‌జైలు అధికారులను ఆదేశించింది. జీవితఖైదు, ఉరిశిక్షలు విధించే కేసుల్లో ఇటువంటి నివేదికను కోరాల్సిందిగా సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. 1984 సిక్కు మారణకాండలో తన భర్త, కుమారుడిని కోల్పోయిన బాధితురాలు తన పిటిషన్‌లో నిందితునికి గరిష్టంగా మరణశిక్ష విధించాలని అభ్యర్థించారు. 1984 అక్టోబర్ 31న ప్రధాని ఇందిరాగాంధీని సిక్కు బాడీగార్డ్స్ హత్య చేసిన మరుసటి రోజు సిక్కులపై ఊచకోత జరిగింది. ఈ మారణకాండలో వేల మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు నిరాశ్రయులయ్యారు. ఈ కేసులో ఆయనకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. అల్లర్ల సమయంలో సరస్వతీ విహార్ ప్రాంతంలో జస్వంత్ సింగ్, ఆయన కుమారుడు తరుణ్‌దీప్ సింగ్‌ను హతమార్చారన్న కేసులో ఆయనను ఇటీవల దోషిగా తేల్చిన ప్రత్యేక న్యాయమూర్తి.. తాజాగా శిక్ష ఖరారు చేశారు. సిక్కు అల్లర్లకు సంబంధించిన మరో కేసులో ఇప్పటికే సజ్జన్ తిహాడ్ జైల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. ఇవేకాక ఆయనపై మరో రెండు కేసులు కోర్టుల్లో పెండింగులో ఉన్నాయి. 1984లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ హత్య అనంతరం చెలరేగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో సజ్జన్ కుమార్ కేవలం భాగస్వామి మాత్రమే కాదని, అతడు ఒక బృందానికి నాయకత్వం వహించినట్లు కోర్టు ప్రాథమికంగా నిర్ధారించింది.

# భర్త పుణ్యస్నానం కోసం భార్య విన్యాసం


**ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 25:** ప్రయాగ్‌రాజ్‌లో అత్యంత వైభవోపేతంగా కొనసాగుతోన్న కుంభమేళా తుది దశకు చేరుకున్న వేళ.. ఓ విచిత్ర ఘటన చోటు చేసుకుంది. నేటితో ముగియనున్న ఆధ్యాత్మిక వేడుకకు దేశ విదేశాల నుంచి కోట్లాది మంది తరలి వచ్చి పవిత్రస్నానాలు ఆచరిస్తున్నారు. కన్నుల పండువగా కొనసాగుతోన్న ఈ కార్యక్రమానికి స్వయంగా హాజరుకాలేకపోయిన తమ వారి కోసం పలువురు తమ సృజనాత్మకతకు పదును పెడుతూ చేస్తోన్న వినూత్న చర్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతున్నాయి. ఇటీవల కొందరు తమ కుటుంబ సభ్యుల ఫొటోలను పవిత్ర సంగమంలో ముంచగా.. మరికొందరు తమవారి పేర్లను చెబుతూ పుణ్యస్నానాలు చేయిస్తున్నారు. తాజాగా ఓ మహిళ చేసిన అసాధారణ చర్యకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. మహా కుంభమేళాకు వెళ్లిన ఓ మహిళ అక్కడి నుంచి తన భర్తకు వీడియో కాల్ చేశారు. ఆ తర్వాత ఫోన్‌ను పలుమార్లు నీటిలో ముంచి తీస్తున్న దృశ్యాలు ఈ వీడియోలో రికార్డయ్యాయి. తద్వారా తన భర్తకు పవిత్ర సంగమంలో పుణ్యస్నానం ఆచరించిన అనుభవాన్ని మిగిల్చేందుకు ప్రయత్నించిన ఆ మహిళ ఆలోచన పట్ల నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. కొందరు ఆమె చర్య వెనుక వున్న తర్కాన్ని ప్రశ్నిస్తుండగా.. ఇంకొందరు ఫోన్ నీటిలోకి జారిపోయి ఉంటే..! అని సరదా కామెంట్లు పెట్టారు. ఇంకొందరైతే ఈ వేడుకకు వెళ్లలేని ఫ్రెండ్స్‌ను ట్యాగ్ చేసి.. ఇదే పద్ధతి ప్రయత్నించాలంటూ సరదాగా సూచిస్తున్నారు.



## శివుడు అభిషేక ప్రియుడు

### జాగరణం శివరాత్రి ప్రత్యేకం

### ఏడాదికి ఒక్కరోజైనా శివార్చన చేస్తే ముక్తి



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 25 : శివుడు అభిషేక ప్రియుడే గాకుండా.. అలాగే బిల్వదళ ప్రియుడు. శివుడు ఎలా పిలిచినా అనుగ్రహిస్తాడని అందుకే భోళాశంకరుడని పురాణాలు కూడా చెబుతున్నాయి. అందుకే అభిషేకాలు, బిల్వార్చనలను శివరాత్రినాడు విధిగా చేస్తుంటారు. పరమశివుడు లింగాకారంలో పుట్టినరోజు కావడంచేత శివుడికి ఇష్టమైన ఆ రోజున శివపూజ జరపడం మంచిదని శైవం చెబుతోంది. త్రిమూర్తులలో మూడోవాడు శివుడు. బ్రహ్మ సృష్టికర్త. విష్ణువు సంరక్షకుడు. మహాశివరాత్రి వ్రతాచరణను గురించి లింగ పురాణం పేర్కొంటోంది. వ్రత ఉద్యాపన గురించి స్కందపురాణంలో వివరంగా ఉంది. శివరాత్రి నాడు పగలంతా ఉపవాసం, రాత్రిపూట లింగార్చన, జాగరణం చేస్తారు. లింగార్చన తరువాత పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం చేయడం కూడా ఓ అలవాటుగా వస్తోంది. శివరాత్రులు అయిదు రకాలు. అవి.. నిత్య శివరాత్రి, పక్ష శివరాత్రి, మాస శివరాత్రి, మహాశివరాత్రి, యోగశివరాత్రి. నిత్యశివరాత్రి అంటే ప్రతిరోజూ రాత్రిపూట చేసే శివారాధన. పక్ష శివరాత్రి అంటే ప్రతి పదిహేను రోజులకొకసారి శివార్చన కోసం నిర్దేశిరచిన రాత్రి. మాసశివరాత్రి అంటే ప్రతి మాసంలోనూ శివపూజకు ఉద్దేశించిన రాత్రి. మిగతా శివరాత్రులు ఏవి కుదిరినా కుదరకపోయినా ఏడాదికొకసారి వచ్చే మహాశివరాత్రినాడు శివపూజ చేయడం పుణ్యప్రదం. తెలిసైనా, తెలియకైనా కొన్ని నీళ్ళు శివలింగం మీద పోసి మరికొన్ని మారేడు దళాలు ఆ

శివలింగంమీద పెడితే భోళాశంకరుడు పరవశించి అలా చేసినవారిని అనుగ్రహించిన కథలు ఎన్నెన్నో మన పురాణాల్లో కనిపిస్తున్నాయి. శివరాత్రినాటి లింగోద్భవ సమయంలో చేసే అభిషేకాలలో కూడా కొన్ని నియమాలున్నాయి. రాత్రి జాగరణం చేస్తూ నాలుగు జాములలోనూ నాలుగు సార్లు నాలుగు రకాలుగా అభిషేకాలు చేస్తుంటారు. మొదటి జాములో పాలతో అభిషేకించి, పద్మాలతో పూజచేసి పెసర పప్పు, బియ్యం కలిపి పులగం వండి శివుడికి నైవేద్యం పెడతారు. రుగ్వేద మంత్ర పఠనం జరుపుతారు. రెండో జాములో పెరుగుతో అభిషేకం, తులసీ దళార్చనచేసి, పాయసం నైవేద్యంపెట్టి యజుర్వేద మంత్రాలను చదువుతారు. మూడోజాములో నేతితో అభిషేకించి, మారేడు దళాలతో అర్చించి, నువ్వుల పొడి కలిపిన తిను బండారాలను నివేదిస్తారు. సామవేద మంత్రపఠన చేస్తారు. నాలుగో జాములో తేనెతో అభిషేకంచేసి నల్ల కలువలతో పూజించి అన్నం నివేదిస్తారు. అధర్వణ వేద మంత్రాలను చదువు తారు. ఇలా అభిషేకాలు చేసే శక్తిలేనివారు అభిషేకం చేసేటప్పుడు శివదర్శనం చేసుకున్నా పుణ్యమే నంటారు. నాలుగో జాము ముగిశాక ఉదయంపూట శివుడిని ఊరేగిస్తారు. ఇలా ఊరేగించడం వెనుక ఓ సామాజిక అంతరార్థం ఉంది. అందుకే భక్తులు శివరాత్రి రోజు అభిషేకం చేసి జాగారం చేయడం ఆనవాయితీగా వస్తోంది. శివుడు మిగతా దేవతలతో పోలిస్తే సులువగా అనుగ్రహం ఇస్తాడని నమ్మిక. శివనామంతో సర్వపాపాలు హరించుకుని పోతాయని అంటారు. అందుకే మనదేశంలో అనే శైవాలయాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. శివుడు లయకారకుడు. శివారాధకులకు మహాశిరాత్రి పర్వదినం. ఉపవాసం ఈ పండగ ప్రత్యేకత. శివుడు భోళా శంకరుడు కావడంతో అడకుండానే వరాలిచ్చే దేవుడుగా ప్రతీతి. శివరాత్రి రోజు ఉపవాసంతో... రాత్రి అభిషేకించి జాగారం చేస్తే ముక్తి లభిస్తుందని ఆర్యోక్తి. అందుకే శివరాత్రి జాగారాలకు ప్రాధాన్యం ఉంది. ఈశాన సంహిత ప్రకారం శివుడు అర్ధరాత్రి సమయంలో తేజోలింగంగా ఆవిర్భవించాడు. అదే లింగోద్భవ కాలం. మహాశివరాత్రి మాఘమాసం కృష్ణపక్షంలో అర్ధరాత్రి ఉండే చతుర్దశి తిథినాడు వస్తుంది. చతుర్దశి ఈతిథి శివుడికి ఎంతో ప్రీతికరమైంది. అందులోనూ కృష్ణచతుర్దశి అంటే అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి తిథి మరీ ప్రీతికరమైంది. ఆ కారణంగానే ప్రతి మాసంలోనూ వచ్చే కృష్ణచతుర్దశి తిథులు మాసశివరాత్రులుగా ఉంటాయి. సంవత్సరం లోని పన్నెండు శివరాత్రులలో మాఘమాసంలో వచ్చే శివరాత్రి శివుడికి బాగా ఇష్టమైంది కాబట్టి దాన్ని మహాశివరాత్రి అని అంటారు. కాశితో పాటు జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరుపుతారు. వినాయక చవితి, శ్రీరామ నవమి లాంటి పండుగలలో దేవుళ్లను పగటిపూట పూజిస్తారు. శివరాత్రినాడు శివుడిని రాత్రిపూట మాత్రమే పూజించడం, మిగిలిన పండుగలలా పంచభక్ష్య పరమాన్నా లతో కాక ఉపవాస దీక్షతో శివరాత్రి పండుగను జరుపుకోవడం ఓ విశేషం. యోగి అయినవాడు తన యోగబలం చేత యోగనిద్రలోకి వెళ్లే రాత్రిని యోగ శివరాత్రి అని అంటారు. సాధారణంగా రాత్రిపూట దేవీపూజను, పగటిపూట దేవపూజను చేయడం ఒక ఆచారంగా ఉంటుంది. కానీ శివరాత్రి విషయంలో మాత్రం ఇది భిన్నంగా కనిపిస్తుంది. శివరాత్రి రోజున రాత్రిపూటే శివపూజ జరుగుతుంది. ఇలా శివ ఆరాధన రాత్రిపూట జరగడానికి ఓ కారణం కూడా ఉంది. పూర్వం ఓసారి ప్రళయం వచ్చినప్పుడు అంతా కటికచీకటిగా మారిపోయింది. ఆ సమయంలో లోక కల్యాణం కోసం పార్వతీదేవి శివుడిని గురించి తపస్సు చేసింది. ఆనాటి పార్వతి తపస్సు మెచ్చిన శివుడు ఆ చీకటిని పోగొట్టి మళ్లీ మామూలుగా రాత్రి, పగలు ఏర్పడేలా చేశాడు. దాంతో జీవులన్నీ మళ్లీ ఆనందించాయి. తాను చేసినట్లుగా అంత రాత్రివేళ శివుడిని గురించి పూజలు చేసినవారికి సర్వసుఖాలు కలిగేలా అనుగ్రహించమని పార్వతీదేవి శివుడిని ప్రార్థించింది. శివుడు అందుకు అంగీకరించాడు. పార్వతి

చేసిన శివపూజకు గుర్తుగా ఆనాటి నుంచి మహాశివరాత్రి పూజా పర్వదినం ఏర్పడింది. ఎవరైనా ఏ కారణం చేతనైనా ఆలయాలకు వెళ్ళి శివదర్శనం చేసుకోలేకపోతే వారికి ఆ ఊరేగింపును చూసి పుణ్యం పొందే భాగ్యం కలుగుతుందని అంటారు.

# కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని ఆశీర్వదించండి

## టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



తిమ్మాపూర్, జనతా న్యూస్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నిలిపిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కి ఓటు వేసి ఆశీర్వదించాలని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఉపాధ్యాయులతో ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఓట్లను అభ్యర్థించారు. విజ్ఞులైన పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వము ఆర్థిక విధ్వంసాన్ని సృష్టించినా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. తాగునీటి ఎత్తిపోతల పథకాలు సక్సెస్ అయ్యాయే తప్ప సాగునీటి ఎత్తిపోతల పథకాలు ఎక్కడ సక్సెస్ కాలేదని అన్నారు. అలాంటిది కేవలం కమిషన్ల కోసమే గత కెసిఆర్ ప్రభుత్వం కాలేశ్వరం ప్రాజెక్టుని చేపట్టిందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 55 లక్షల ఇండ్లను ఇస్తే గడిచిన

పదేళ్లలో కెసిఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వలేదని అన్నారు. గతంలో రేషన్ కార్డులు సైతం ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రక్రియను ప్రారంభించిందని చెప్పారు.

ఏ ప్రభుత్వం చేయని సాహసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసి బీసీ కులగలను చేపట్టి 56% బీసీలు ఉన్నట్లు తేల్చిందని తెలిపారు. విద్యా సంస్థల ద్వారా ఎందరుకు విద్యను అందిస్తున్న ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టభద్రులు ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోర పెల్లి రమణారెడ్డి, సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, గంకిడి లక్ష్మారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, మామిడి అనిల్, బండారి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ఇంటి దొంగను పట్టుకున్న పోలీసులు



## హుజురాబాద్ దోపిడీ కేసులో కుమారుడే సూత్రధారి

### వీడిన చిక్కుముడి

(కోరెం సుధాకర్ రెడ్డి జనతా .న్యూస్ ప్రతినిధి హుజురాబాద్)

ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడు అన్నది సామెత. కానీ ఇంటి దొంగను హుజురాబాద్ పోలీసులు పట్టుకున్నట్టు తెలుస్తోంది. పట్టణంలో సంచలనం సృష్టించిన దోపిడీ కేసు చిక్కుముడి వీడినట్టు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం ప్రతాపవాడలోని ప్రతాప రాఘవరెడ్డి నివాసంలోకి దొంగలు చొరబడి 70 తులాల బంగారం ఏడు లక్షల రూపాయల నగదు దోచుకు వెళ్లారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దొంగల దాడిలో రాఘవరెడ్డి తో పాటు అతని భార్యకు కూడా గాయాలయ్యాయి. పోలీసులు తమదైన చర్యలు ఈ కేసును విచారించారు. కుటుంబ సభ్యులను అనుమానించారు. ఈ కోణంలో విచారించగా.. అసలు నిందితుడు.. అతని కుమారుడు నాగరాజు అని వెల్లడైనట్టు సమాచారం. రాఘవ రెడ్డి కుమారుడు నాగరాజు స్థానికంగా హోటల్ నడుపుతున్నాడు. తనకు అప్పులు కావడంతో.. వాటిని తీర్చేందుకు తన తండ్రి వద్ద ఉన్న బంగారాన్ని దొంగతనం చేసేందుకు పథకం రచించినట్టు పోలీసుల విచారణలో వెల్లడైనట్టు సమాచారం. ఇటీవలే హనుమాన్ దేవాలయం కమిటీ డైరెక్టర్ గా కూడా నియామకం అయ్యాడు. ఈ దొంగతనం కేసులో.. నాగరాజు ప్రధాన సూత్రధారి కాగా.. అతని హోటల్లో పనిచేసే వారిచే ఈ దొంగతనం చేయించినట్టుగా పోలీసులు భావిస్తున్నారు. 70 తులాల బంగారం, ఏడు లక్షల నగదు ఎత్తుకెళ్లడం స్థానికంగా సంచలనం రేపింది. చివరకు ఇంటి దొంగను పోలీసులు పట్టుకోవడం సర్వత్ర చర్చనీయాంశం అయింది. కన్న తల్లిదండ్రులపైనే డబ్బుల కోసం దొంగతనం దాడులు చేయడం గమనార్హం. పోలీసులు త్వరలోనే వివరాలను వెల్లడించనున్నట్లు తెలుస్తోంది. దోపిడీ జరిగిన కొద్ది గంటల్లోనే కేసును ఛేదించిన స్థానిక పోలీసు ఇన్స్పెక్టర్ తిరుమల్ గౌడ్ ను ప్రజలు అభినందిస్తున్నారు.

# కోటప్పకొండలో శివరాత్ర సందడి

### ప్రభలతో కొండకు చేరుకున్న భక్తులు

### దక్షిణామూర్తిగా విరాజిల్లుతున్న స్వామి



**గుంటూరు :** కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకుంది. కోటయ్య స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని కోటయ్య తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం శివరాత్రి దర్శనాలకు భారీగా ఏర్పాట్లు చేశారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ స్తంభించకుండా పోలీసు శాఖ చర్యలు తీసుకుంది. ప్రభుత్వం తరపున ఏటా తిరునాళ్ల రోజున పట్టు వస్త్రాలను అందజేస్తారు. సంప్రదాయానికి అనుగుణంగా ఈ ఏడాది స్వామికి ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలను దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమర్పించనున్నారు. తెల్లవారు జాము నుంచే వేలాదిగా భక్తులు కోటప్పకొండకు తరలి వచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహాశివరాత్రి రోజున శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొక్కుబడి ప్రభలతో భక్తులు కొండకు తరలివచ్చారు. నరసరావుపేట నుంచి చిన్నారులు కాలి నడకన ప్రభలతో కోటయ్య సన్నిధికి చేరుకున్నారు. శీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైనలను ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం క్యూలైనలో భక్తుల రద్దీ నెలకుంది. నరసరావుపేట పురపాలక సంఘం ప్రభ కోటప్పకొండకు చేరుకుంది. కొండ దిగువున తలనీలాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో రామ కోటిరెడ్డి, పాలక మండలి చైర్మన రామక్రిష్ణ కొండలరావు దేవస్థానం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోటప్పకొండ తిరుణాళ్లకు రాష్ట్ర పండుగ హోదా ఉండటంతో ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు.

## శ్రీకాళహస్తిలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

### శివరాత్రి దర్శనాలకు భారీగా ఏర్పాట్లు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 25 : శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని వేకువజామున రెండు గంటలకే సర్వదర్శనం ప్రారంభించాలని ముక్కంటి ఆలయాధికారులు నిర్ణయించారు. వేకువజామున ఒంటి గంటలకు లింగోద్భవ దర్శన ఏర్పాట్లు చేయనున్నారు. భవుడి మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ఇప్పటికీ ప్రధాన ఆలయాన్ని ముచ్చటైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. గోపురాలకు కొత్త రంగులద్దడంతో కళకళలాడుతున్నాయి. భక్తకన్నప్ప, రామసేతు వంతెనలపైనా, పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. అరటిచెట్లు, మామిడాకుల పచ్చతోరణాలు, కాషాయరంగు జెండాలతో వీధులు దర్శనమిస్తున్నాయి. తరలి వచ్చే భక్తుల కోసం ఆలయంలో చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. చతుర్మాడ వీధులు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికైన ధూర్జటి కళాప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. సన్నిధివీధిలో ఏర్పాటు చేస్తున్న కైలాసం సెట్టింగ్ పనులు జోరందుకున్నాయి. రథాలు, నారద పుష్కరణిలోని తెప్పలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవ ఏర్పాట్లు ఆలస్యం కావడంతో, ఇప్పటికీ సాంస్కృతిక కార్యక్రమాల షెడ్యూలు ఖరారు కాలేదు. అయితే పలువురు పీఠాధిపతులు, సినీనటులు, గాయకులు, కళాకారులకు ఉత్సవాలకు రావాలని అధికారులు ఆహ్వానం పంపారు. సర్వజగత్తును పరిపాలించే.. సర్వ జగద్రక్షకుడైన సోమస్కంధమూర్తికి.. యాగరక్ష పెట్టాక పురవీధుల్లో ఊరేగింపునకు తీసుకెళ్లడం ఇక్కడి సంప్రదాయంగా వస్తోంది. బ్రహ్మోత్సవ రోజుల్లో ఉత్సవమూర్తులతో నిర్వహించే ఊరేగింపు మహోత్సవానికి ఎంతో ప్రాభవం ఉంటుంది. అందుకే సాధారణ రోజుల వలే కాకుండా.. బ్రహ్మోత్సవ రోజుల్లో.. దేవతామూర్తులు బయటకు వెళ్లాలంటే.. ఆలయంలోని యాగశాల వద్ద నిలిపి యాగరక్ష పెట్టాక మాత్రమే బయటకు తీసుకెళ్లడం సంప్రదాయంగా వస్తోంది. ఆలయంలోని అలంకార మండపంలో ఉత్సవ అలంకరణలు పూర్తయిన శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కంధమూర్తి ఉత్సవమూర్తులను యాగశాల వద్ద యాగకలశాలకు రోజూ హోమాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సిద్ధం చేసిన యాగరక్షను ఉత్సవర్లకు అద్దిన తరవాత.. వీళ్లను ఊరేగింపుగా తీసుకెళ్తుంటారు. ఈ విశేషోత్సవాన్ని సందర్శించేందుకు జనం అధిక సంఖ్యలో రావడం విశేషం. ఉత్సవాలను పురస్కరించుకుని గంగాభవానీ సమేత శివయ్య దశకంఠుడిపై పురవిహారం చేస్తాడు.

## భక్తుల రాకతో కిటకిటలాడుతున్నశ్రీశైలం

### భారీగా తరలి రావడంతో సందడిగా గిరులు

శ్రీశైలం,ఫిబ్రవరి 25 : ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. భక్తులతో శ్రీశైలం కిటకిటలాడుతోంది. శివనామస్మరణతో ఆలయ పురవీధులు మారుమ్రోగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వారికి వాహనసేవలు వైభవంగా సాగుతున్నాయి. శ్రీశైల పుణ్యక్షేత్రం భక్తులతో రద్దీగా మారింది. శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామిదర్శనం చేసుకోవటానికి నల్లమల అటవీప్రాంతం నుంచి భారీగా భక్తులు తరలి రావడంతో శ్రీగిరులు భక్తులతో కోలాహలంగా మారయి. ఆదిదంపతులైన శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లు కల్యాణశోభతో ముస్తాబయ్యారు. ఆలయ ప్రాంగణంలోని అలంకారమండపంలో స్వామి అమ్మవార్లకు అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో విశేషపూజలు నిర్వ హించారు. అనంతరం వేలాది మంది భక్తజనం నడుమ గ్రామోత్సవానికి తీసుకొచ్చారు. ఉత్సవం ముంగిట మహిళల కోలాటాలు, వేషధారణలు, డోలు విన్యాసాలు, నందికోళ విన్యాసాలు, బుట్టబొమ్మలు వంటి సాంస్కృతిక కళా రూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం నుంచి అడుగడుగునా ఉత్సవమూర్తులకు మంగళహారతులు ఇచ్చుకుంటూ పురవీధుల్లోకి తీసుకువచ్చారు. గంగాధరమండపం వద్ద రంగు రంగుల పుష్పా లు, విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేసిన పుష్పపల్లకీలో శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి అర్చకులు మంగళహారతులిచ్చారు.

## మరో భాషా యుద్ధానికి మేం సిద్ధమే : సీఎం స్టాలిన్



**చెన్నై:** లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజన అంశం పై తమిళనాడు ముఖ్యమం త్రి ఎంకే. స్టాలిన్ స్పందిం చారు. ఈ అంశం దక్షిణాది రాష్ట్రాలపై వేలాడుతున్న కత్తి అని వ్యాఖ్యానించారు. చెన్నైలో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశా రు. రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై చర్చించేందుకు మార్చి 5న అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. "జనాభాను నియంత్రించడం భారత్ ముందున్న అతిపెద్ద లక్ష్యం. ఇందులో తమిళనాడు విజయం సాధించింది. అయితే.. తక్కువ జనాభా ఉండడం వల్ల పార్లమెంట్ సీట్లు తగ్గే అవకాశం ఉంది. ఈ పరిస్థితిని రాష్ట్రం ఎదుర్కొంటోంది. ఒకవేళ సీట్లు తగ్గితే.. 39 కాకుండా 31 మంది ఎంపీలు మాత్రమే ఉంటారు" అని పేర్కొన్నారు. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని ఉద్దేశిస్తూ స్టాలిన్ మ-రోసారి మాట్లాడారు. మరో భాషా యుద్ధం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కాగా.. నూతన విద్యావిధానం ద్వారా హిందీని బలవంతంగా రుద్దుతున్నారంటూ.. రాష్ట్రానికి రావాల్సిన నిధులను నిలిపివేశారని గతంలో స్టాలిన్ ప్రభుత్వం ఆరోపించింది. భాషలను రాజకీయ కోణంలో చూడవద్దంటూ కేంద్రాన్ని కోరిందితమిళనాడుతో పెట్టుకోవదంటూ స్టాలిన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఇటీవల స్పందించిన ప్రధాని మోదీ.. భారతీయ భాషల మధ్య మంటలు పెట్టొద్దంటూ హితబోధ చేశారు. దేశ భాషల మధ్య ఎన్నడూ వైరం లేదని.. అవన్నీ పరస్పరం చేయూతనందించుకుంటూ సుసంపన్నమయ్యాయని తెలిపారు. తాజాగా భాష అంశంపై స్పందిస్తూ.. స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు..

## ప్రతికూల మనస్తత్వంతోనే అలాంటి మాటలు : అఖిలేశ్ యాదవ్



**ప్రయాగ్‌రాజ్ :** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా నిర్వహణలో లోపాలపై విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలను ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ పందులు, రాబందులతో పోల్చిన సంగతి తెలిసిందే. దీనిపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఘాటుగా స్పందించారు. ఆయన మాటలు దేశ గౌరవాన్ని విస్మరించే ప్రతికూల మనస్తత్వాన్ని తెలుపుతుందన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'కొంతమంది మహాకుంభమేళాను రాజకీయ అవకాశవాదంగా మలుచుకున్నారు. స్వీయ ప్రచారాలకు మాధ్యమంగా వినియోగిస్తున్నారు. వారు తమ నైతికతను మరిచి ప్రసంగాలు చేస్తున్నారు. మహాకుంభ్ వంటి పవిత్రమైన దానిగురించి మాట్లాడేటప్పుడు సరైన పదాలు వినియోగించాలి. అవి వ్యక్తి ప్రతిష్టను నిలబెడతాయి. కానీ, వారి మాటలు అదుపుతప్పాయి. ఇది వారి ప్రతికూల మనస్తత్వానికి నిదర్శనం' అని ఆయన రాసుకొచ్చారు. కుంభమేళ నిర్వహణలో లోపాలపై రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈనేపథ్యంలో మహాకుంభ్‌లో ఎవరు ఏది కోరుకుంటే అది దక్కుతుందంటూ యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. 'రాబందులకు మృతదేహాలు దొరికాయి. పందులకు అపరిశుభ్రత కనిపించింది. సున్నిత స్వభావులకు సుందరమైన సంబంధ బాంధవ్యాలు, వ్యాపారులకు వ్యాపారం లభించాయి' అంటూ వ్యాఖ్యాలు చేశారు. ఇదిలాఉండగా.. అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశిస్తూ.. 'మీలా మేం మతంతో ఆటలాడలేదు. మీ హయాంలో కుంభమేళా ఏర్పాట్లు సమీక్షించేందుకు ముఖ్యమంత్రికి సమయమే లేదు' అంటూ ఎద్దేవా చేశారు.



## అందులో 'టీ' అంటే ట్రంప్ కాదనే విషయాన్ని మోడీ గుర్తుచేయాలి : కాంగ్రెస్

**ఢిల్లీ:** కెనడా, మెక్సికో, చైనా, భారత్ సహా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ప్రధాని నరేంద్ర మోదీకి సవాల్ విసిరారు. ప్రపంచ దేశాలు పరస్పర సుంకాలు విధించుకోవడం అనేది అంతర్జాతీయ వాణిజ్య సూత్రాలకు పూర్తి విరుద్ధమని అన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థలో టీ అంటే ట్రంప్ కాదనే విషయాన్ని మోదీ తన స్నేహితుడు ట్రంప్‌నకు గుర్తు చేయాలని సవాల్ చేశారు. అమెరికా విధిస్తున్న పరస్పర సుంకాలపై మరో కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఐదు ప్రశ్నలు వేశారు.

1.అమెరికా నుంచి దిగుమతులు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో శ్రామికశక్తిలో 45.76 శాతంగా ఉన్న రైతుల ప్రయోజనాలను ఎలా కాపాడడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటోంది?

2. రైతులకు మద్దతును అందించడానికి కనీస మద్దతు ధర చట్టబద్ధతలో మార్పులను ప్రభుత్వం ఇప్పుడైనా పరిశీలిస్తుందా?

3. అమెరికా నుంచి దిగుమతయ్యే వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ డంపింగ్ యార్డ్‌గా మారకుండా నిరోధించడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటోంది?

4. విదేశీ ఉత్పత్తుల నుండి పెరిగిన పోటీ కారణంగా ప్రభావితమయ్యే ఎంఎస్ఎంఈ రంగాన్ని రక్షించడానికి ప్రభుత్వం ఎటువంటి ప్రణాళికలు చేస్తోంది?

5. భారత జీడీపీపై పరస్పర సుంకాల ప్రభావం ఏమిటి?

తమ దిగుమతులపై సుంకాలు విధించే అన్ని దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు పేర్కొన్నారు. అమెరికా దిగుమతులపై ఏ దేశాలు సుంకాలు వసూలు చేసినా తిరిగి ఆయా దేశాలపై సుంకాలు వసూలు చేస్తామని అన్నారు. అలాగని ఎక్కువ తక్కువ కాకుండా.. ఆయా దేశాలు మాకు ఎంత సుంకం విధిస్తుందో దానికి తగ్గట్లే తాము విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది వాణిజ్య యుద్ధం కాదని అన్నారు. ఇక, ఈ పరస్పర పన్నుల విధానంలో భారత్‌కు ఎలాంటి మినహాయింపు లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోదీ ట్రంప్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే ఆయన ఈ విషయంపై స్పష్టతనిచ్చారు.

# కుంభమేళాలో మరోసారి ఆంక్షల విధింపు



**ప్రయాగ్‌రాజ్:** మహా కుంభమేళాలో పాల్గొనేందుకు కోట్లాది మంది భక్తులు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు తరలివెళు తున్నారు. బుధవారంతో ఈ ఆధ్యాత్మిక వేడుక ముగుస్తుండడం, మహా శివరాత్రి కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో హాజరవ్వనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. ఇందులోభాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్ గా మారుస్తున్నామని ప్రకటించారు.సాయంత్రం ఆరు గంటల నుంచి ఈ ఆంక్షలు ప్రయాగ్‌రాజ్ మొత్తం అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. స్థానికుల కోసం నిత్యావసరాలను తీసుకొచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. ప్రజలకు ఉచిత ఆహార, వైద్య సదుపాయాలు ఏర్పాటుచేశామన్నారు. భక్తులు తమకు సమీపంలోని ఘాట్‌లలోనే పుణ్యస్నానాలు ఆచరించాలని సూచించారు. కొన్నిరోజుల క్రితం మౌని అమావాస్య, వసంత పంచమి వంటి ముఖ్యమైన రోజుల్లో భక్తులు పెద్దఎత్తున పోటెత్తడంతో ప్రయాగ్‌రాజ్ మార్గంలోని జాతీయరహదారిపై సుమారు 350 కి.మీ. పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో భక్తులు 24 గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. రద్దీని నివారించడానికి కొన్ని గంటల పాటు భక్తులు ఎవరూ కుంభమేళాకు రావద్దని అధికారులు ప్రకటించారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో మళ్లీ అలాంటి పరిస్థితి తలెత్తొద్దనే ఉద్దేశంతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ మహా కుంభమేళా జనవరి 13న మొదలుకాగా.. ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. ఇప్పటి వరకు పవిత్ర త్రివేణి సంగమంలో కోట్లాది మంది పుణ్య స్నానాలు ఆచరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

## గిన్నిస్ రికార్డు దిశగా కుంభమేళాలో 15 వేల మందితో పారిశుద్ధ్య నిర్వహణ



**ప్రయాగ్‌రాజ్ :** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు దాదాపు 60 కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈనేపథ్యంలోనే గిన్నిస్ రికార్డు లక్ష్యంగా పారిశుద్ధ్య కార్మికులు క్లీన్ డ్రైవ్‌ను నిర్వహించారు. దాదాపు 15 వేల మంది కార్మికులు చీపురు పట్టి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు, ప్రయాగ్‌రాజ్ మేయర్ గణేశ్ కేసర్వాని, మహాకుంభ్ ప్రత్యేక ఈవో ఆకాంక్ష రాణా పర్యవేక్షించారు. రికార్డుకు సంబంధించిన తుది నివేదిక మూడు రోజుల్లో వెలువడనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇక, 2019లో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళాలో 10 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు పాల్గొని గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. ఇదిలాఉండగా.. ఈ మహా కుంభమేళా జనవరి 13న మొదలుకాగా.. ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. ఇప్పటివరకు పవిత్ర త్రివేణి సంగమంలో 60 కోట్లకు మందికి పైగా పుణ్యస్నానాలు ఆచరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఇక, ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం రావడంతో భక్తుల రాక మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

## మద్యం విధానంతో రూ.2వేల కోట్ల నష్టం

### ఢిల్లీ అసెంబ్లీ ముందుకు కాగ్ నివేదిక



**ఢిల్లీ:** దేశ రాజధాని దిల్లీలో గత ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానంపై కాగ్ రూపొందించిన నివేదిక అంశం ఎన్నికల ముందు పెనుదుమారం రేపింది. ఈ నివేదికను తాజాగా భాజపా సర్కారు అసెంబ్లీలో ప్రవేశపెట్టి అందులోని అంశాలను బయటపెట్టింది. 2021-22లో తీసుకొచ్చిన మద్యం విధానం కారణంగా ఢిల్లీ ప్రభుత్వానికి రూ.2000 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కాగ్ తేల్చింది. నిపుణుల అభిప్రాయాలు తీసుకోకపోవడం, ఫిర్యాదులు వచ్చినా బిడ్డింగును అనుమతించడం, ఉల్లంఘనలకు జరిమానా వేయకపోవడం, విధానాల రూపకల్పనలో పారదర్శకత లేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయని కాగ్ దర్యాప్తులో తేలింది. కొత్త మద్యం విధానం కారణంగా అప్పటి ప్రభుత్వం రూ.941.53 కోట్ల ఆదాయం కోల్పోయిందని నివేదికలో పేర్కొంది. ఇక, లైసెన్సు ఫీజుల కింద మరో రూ.890.15 కోట్లు నష్టపోయినట్లు తెలిపింది. లైసెన్సుదారులకు మినహాయింపుల రూపంలో మరో రూ.144 కోట్లు కోల్పోయినట్లు వెల్లడించింది.ఈ నూతన మద్యం విధానాన్ని అప్పటి కేజ్రీవాల్ సర్కారు తీసుకొచ్చింది. దీనిపై విమర్శలు రావడంతో కొన్ని నెలలకే దాన్ని వెనక్కి తీసుకుంది. అనంతరం ఈ వ్యవహారంపై ఈడీ, సీబీఐ కేసులు నమోదయ్యాయి. మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మరో సీనియర్ నేత మనీశ్ సిసోదియా జైలుకెళ్లి బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే.

**ఆప్ ఎమ్మెల్యేల సస్పెన్షన్..**

మరోవైపు, నేటి సభా కార్యకలాపాల నుంచి ఆప్ ఎమ్మెల్యేలను స్పీకర్ సస్పెండ్ చేశారు. సీఎం కార్యాలయం నుంచి బీఆర్ అంబేడ్కర్, భగత్‌సింగ్‌ల ఫొటోలు తొలగించారంటూ ప్రతిపక్ష ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఉదయం సభ ప్రారంభం కాగానే లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రసంగించారు. ఆయన మాట్లాడుతుండగా.. ఆప్‌నేతలు నిరసనలు చేపట్టారు. దీంతో స్పీకర్ విజేందర్ గుప్తా వారిని సభ నుంచి సస్పెండ్ చేశారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నేత ఆతిశీ సహా 12 మంది విపక్ష ఎమ్మెల్యేలను ఒకరోజంతా అసెంబ్లీకి రాకుండా సస్పెండ్ చేస్తున్నట్లు సభాపతి వెల్లడించారు. మద్యం కుంభకోణంపై కాగ్ ఇచ్చిన నివేదికపై ప్రజల దృష్టిని మరల్చేందుకు ఆ పార్టీ నిరసనలకు పాల్పడుతోందని అధికార పార్టీ ఆరోపించింది. ముఖ్యమంత్రి కార్యాలయంలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్, భగత్‌సింగ్, రాష్ట్రపతి, ప్రధానమంత్రుల చిత్రపటాలు ఉన్నాయని పేర్కొంటూ ఇప్పటికే ఓ ఫొటోను విడుదల చేసింది.

## ఢిల్లీ అసెంబ్లీ సెషన్ మరో రెండు రోజులు పొడిగింపు.. అందుకేనా..!



**ఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలను మరో రెండు రోజులు పొడిగించారు. షెడ్యూల్ ప్రకారం అసెంబ్లీ ఫిబ్రవరి 24, 25, 27 తేదీల్లో మూడు రోజులపాటు కొనసాగాల్సి ఉంది. తాజాగా ఢిల్లీ సర్కారు ప్రకటించిన ప్రకారం ఫిబ్రవరి 28, మార్చి 1న కూడా సమావేశాలు జరగనున్నాయి. అంటే ఈ ప్రత్యేక సెషన్ మూడు రోజులకు బదులుగా మొత్తం ఐదు రోజులు కొనసాగనుంది.ఫిబ్రవరి 24న అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు మొదలవగానే ముందుగా ప్రొటెం స్పీకర్‌ను ఎన్నుకున్నారు. ఆ తర్వాత ప్రొటెం స్పీకర్ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణస్వీకారాలు చేయించారు. సీఎం రేఖా గుప్తా సహా ఎమ్మెల్యేలంతా ప్రమాణ స్వీకారాలు చేశారు. ఆ తర్వాత బీజేపీ ఎమ్మెల్యే విజేందర్ గుప్తాను అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నుకున్నారు. ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. మంగళవారం రెండో రోజు సభ మొదలవగానే సీఎం రేఖా గుప్తా.. కాగ్ నివేదికల్లో ఒక దానిని ప్రవేశపెట్టారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కారణంగా ప్రభుత్వానికి రూ.2000 కోట్ల నష్టం వచ్చిందని కాగ్ ఇచ్చిన నివేదికను సభ ముందుంచారు. దాంతో అధికార బీజేపీ, ప్రతిపక్ష ఆప్ ఎమ్మెల్యేల మధ్య వాగ్వాదం జరిగింది. దాంతో స్పీకర్ ప్రతిపక్ష నాయకురాలు అతిషి సహా 21 మంది ఆప్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేశారు. తదుపరి మూడు రోజులపాటు వారిపై సస్పెన్షన్ కొనసాగనుంది. కాగ్ నివేదికపై చర్చకు ప్రభుత్వం పూనుకోగా.. అసెంబ్లీ నుంచి అంబేద్కర్ చిత్రపటాన్ని తొలగించారనే అంశాన్ని ఆప్ లేవ-నెత్తింది. దాంతో తమ తప్పులు బయటికి వస్తాయనే ఆప్ అంబేద్కర్‌ను అడ్డం పెట్టుకుంటోందని బీజేపీ విమర్శిస్తోంది. ఈ క్రమంలో కాగ్ నివేదికపై విస్తృతంగా చర్చ జరిపి ఆప్ సర్కారు తప్పిదాలను ఎండగట్టాలనేది ప్రభుత్వ వ్యూహంగా కనిపిస్తోంది. అందుకే అసెంబ్లీ సెషన్‌ను మరో రెండు రోజులు పొడిగించినట్లు తెలుస్తోంది.

## ప్రీతి జింటాకు రూ.18 కోట్ల రుణమాఫీ పోస్ట్

### కాంగ్రెస్‌పై నటి ఫైర్



**చండీగఢ్ :** బాలీవుడ్ నటి, ఐపీఎల్‌లో పంజాబ్ జట్టు సహ యజమాని ప్రీతి జింటా కాంగ్రెస్ పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నటి ప్రీతి జింటా తన సామాజిక మాధ్యమ ఖాతాలను బీజేపీకి అప్పగించినందుకు న్యూఇండియా కోఆపరేటివ్ బ్యాంక్‌లో ఆమె తీసుకున్న రూ.18 కోట్ల రుణం మాఫీ అయ్యిందని ఆరోపిస్తూ కేరళ కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. గత వారం ఆ బ్యాంకును మూసేయడంతో డిపాజిటర్లు రోడ్డునపడ్డారని ఆరోపించింది. ఈ పోస్ట్‌పై ప్రీతిజింటా స్పందిస్తూ.. తాను సామాజిక మాధ్యమ ఖాతాలు సొంతంగానే నిర్వహించుకుంటానని, ఎవరికీ ఇవ్వలేదని, ఇలా తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. 10ఏళ్ల కిందటే బ్యాంకు నుంచి తాను తీసుకొన్న రుణాన్ని తీర్చేశానని స్పష్టంచేశారు."కాంగ్రెస్ పార్టీ చేసిన పోస్ట్ చూసి నేను ఆశ్చర్యపోయాను. నాకోసం ఎవరూ.. ఏ రుణాన్నీ మాఫీ చేయలేదు. ఒక రాజకీయ పార్టీ నా పేరును ఉపయోగించి తప్పుడు వార్తలు ఎలా ప్రచారం చేస్తుంది? పదేళ్లక్రితం ఓ బ్యాంకు నుంచి రుణం తీసుకొని.. దానిని కట్టేశాను. విషయం తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటు. భవిష్యత్తులో ఎటువంటి అపార్థాలు రాకూడదనే ఉద్దేశంతో ఆ పార్టీ వ్యాఖ్యలపై స్పందిస్తున్నాను" అని ప్రీతిజింటా పేర్కొన్నారు.ముంబయిలోని న్యూఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్, అకౌంట్స్ హెడ్ హితేష్ మెహతా బ్యాంకు నుంచి రూ.122 కోట్లను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ ఆర్థిక నేరం కేసులో ప్రస్తుతం అతడు ముంబయి పోలీసుల కస్టడీలో ఉన్నారు. ఈనేపథ్యంలో బాలీవుడ్ నటి ప్రీతిజింటాపై కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ ఆరోపణలు చేయడం గమనార్హం.



## 1984 నాటి అల్లర్ల కేసులో మాజీ ఎంపీ సజ్జన్‌కు జీవిత ఖైదు

**ఢిల్లీ:** దేశ రాజధాని దిల్లీలో 1984లో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో దోషిగా తేలిన కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌కు దిల్లీ ప్రత్యేక కోర్టు శిక్షను ఖరారు చేసింది. ఈ కేసులో ఆయనకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. అల్లర్ల సమయంలో సరస్వతీ విహార్ ప్రాంతంలో జస్వంత్ సింగ్, ఆయన కుమారుడు తరుణ్‌దీప్ సింగ్‌ను హతమార్చారన్న కేసులో ఆయనను ఇటీవల దోషిగా తేల్చిన ప్రత్యేక న్యాయమూర్తి.. తాజాగా శిక్ష ఖరారు చేశారు.సిక్కు అల్లర్లకు సంబంధించిన మరో కేసులో ఇప్పటికే సజ్జన్ తిహాడ్ జైల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. ఇవేకాక ఆయనపై మరో రెండు కేసులు కోర్టుల్లో పెండింగులో ఉన్నాయి. 1984లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ హత్య అనంతరం చెలరేగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో సజ్జన్ కుమార్ కేవలం భాగస్వామి మాత్రమే కాదని, అతడు ఒక బృందానికి నాయకత్వం వహించినట్లు కోర్టు ప్రాథమికంగా నిర్ధారించింది.

## కిక్కిరిసిన అయోధ్య ఆలయం..

### రామ్‌లల్లా దర్శనం కోసం బారులు తీరిన భక్తులు..



**అయోధ్య:** అయోధ్యలో కొలువుదీరిన రామ్‌లల్లాను దర్శించుకునేందుకు భక్తులు ఎగబడుతున్నారు. రోజూ లక్షల సంఖ్యలో జనం రామయ్యను దర్శించు కుంటున్నారు. ఇంకా నిర్మాణ దశలోనే ఉన్న ఆ ఆలయానికి భక్తుల తాకిడి విపరీతంగా ఉన్నది. కుంభమేళాలో పుణ్య స్నానాలు చేసేందుకు వెళ్తున్న భక్తులు.. ఆ భక్తిభావంతోనే రామయ్య సన్నిధికి కూడా తరలివస్తున్నారు. దీంతో అయోధ్య వీధులన్నీ కిక్కిరిసిపోయాయి.ప్రతి క్షణం వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుంటున్నారు. శ్రీ రామ జన్మభూమి స్థలంలో నిర్మించిన నూతన ఆలయానికి అపరిమిత సంఖ్యలో భక్తులు పోటెత్తుతున్నారు. కుంభమేళా నుంచి డైరెక్టుగా అయోధ్య చేరుకుంటున్నారు. అనేక లైన్లలో భక్తుల్ని రామయ్య దర్శనం కోసం పంపించే ఏర్పాట్లు చేశారు. రామజన్మభూమిలో భక్త కోటి ప్రవాహాన్ని .. యాత్రికులు తమ మొబైళ్లలో బంధిస్తున్నారు. రామ్‌లల్లా దర్శనం కోసం వెళ్లిన ఓ భక్తుడు తీసిన వీడియోను పోస్టు చేస్తున్నాం. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద.. వేల సంఖ్యలో భక్తులు రామనామాన్ని స్మరిస్తూ ముందుకు వెళ్తున్నట్లు ఆ వీడియోలో ఉంది.

## త్రిభాషా సూత్రం తప్పు.. బీజేపీకి తమిళ నటి రాజీనామా



**చెన్నై:** త్రిభాషా సూత్రం పై తమిళనాడు ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య వార్ కొనసాగుతోంది. జాతీయ విద్యావిధానం - 2020 ప్రకారం రాష్ట్రాలు తప్పనిసరిగా త్రిభాషా (హిందీ, ఇంగ్లిష్, ప్రాంతీయ భాష) సూత్రాన్ని అమలు చేయాలని కేంద్ర ఆదేశాలు జారీచేయడం.. ఆ ఆదేశాలను తమిళనాడు సర్కారు తిరస్కరించడం వివాదానికి కారణమైంది.జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం పాఠశాలల్లో ఇంగ్లిష్, ప్రాంతీయ భాషతోపాటు హిందీ లాంగ్వేజ్‌ను కూడా తప్పనిసరి చేయాలని కేంద్రం ఆదేశించింది. అయితే హిందీ భాషను ప్రవేశపెట్టేందుకు తమిళనాడు సర్కారు ససేమిరా అంటోంది. అది భవిష్యత్తులో తమిళభాషను మరుగున పడేస్తుందని వాదిస్తోంది. హిందీ కారణంగానే ఉత్తరాదిలో ప్రాంతీయ భాషల పరిధి తగ్గిందని చెబుతోంది.అయితే తమిళ సర్కారు వాదనను కేంద్ర ఖండిస్తోంది. స్టాలిన్ ప్రభుత్వ వాదనలో పసలేదని అంటోంది. విద్యార్థులకు అదనంగా మరో భాషను నేర్పడంవల్ల నష్టం ఏముంటుందని ప్రశ్నిస్తోంది. త్రిభాషా సూత్రాన్ని అమలు చేయని రాష్ట్రాలకు విద్యానిధులు అందజేయబోమని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో తమిళనాడుకు చెందిన నటి, బీజేపీ నాయకురాలు రంజనా నచియార్ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.తమిళనాడులో త్రిభాషా సూత్రాన్ని అమలు చేయాలని బలవంతపెట్టడం తప్పని, తమిళ భాష ప్రభను తగ్గించే ఆ సూత్రానికి తాను వ్యతిరేకమని ఆమె చెప్పారు. ఈ విషయంలో కేంద్రం నిర్ణయాన్ని నిరసిస్తూ తాను బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
Regional
బుధవారం 26 ఫిబ్రవరి 2025




## ఇంగ్లాండ్‌తో అఫ్ఘానిస్థాన్ అమీతుమీ

### ఓడిన జట్టు ఇంటికే!

ఛాంపియన్స్ ట్రోఫీలో మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగుతున్నాయి. గ్రూప్-ఎ సెమీస్ బెర్తులు తేలిపోయాయి. గ్రూప్‌లోని నాలుగు జట్లు ఇంకా ఒక్కో మ్యాచ్ ఆడాల్సి ఉండగానే.. సెమీస్ రేసు ముగిసిపోయింది. రెండేసి విజయాలతో భారత్, న్యూజిలాండ్ నాకౌట్‌కు దూసుకెళ్లగా.. ఆడిన రెండు మ్యాచ్‌లూ ఓడిన పాకిస్థాన్, బంగ్లాదేశ్ టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఇక, గ్రూప్-బిలో సెమీస్ రేసు రసవత్తరంగా మారనుంది. సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా ఒక్కో విజయం సాధించి రెండేసి పాయింట్లతో ఉన్నాయి. ఇంగ్లాండ్, అఫ్ఘానిస్థాన్ ఇంకా పాయింట్ల ఖాతా తెరవలేదు. ఈ నేపథ్యంలో బుధవారం అఫ్ఘాన్, ఇంగ్లాండ్ మధ్య కీలక సమరం జరగనుంది. ఈ మ్యాచ్ ఇరుజట్లకు చావోరేవో లాంటి. సెమీస్ రేసులో నిలవాలంటే ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాలి. ఓడిన జట్టు లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టినట్లే.

**ఇంగ్లాండ్ భారీ స్కోరు చేసినా ..**

ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ భారీ స్కోరు చేసినా కాపాడుకోలేకపోయింది. బెన్ డకెట్ (165) భారీ శతకం బాదడంతో ఇంగ్లాండ్ కంగారుల ముందు 352 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. జోష్ ఇంగ్లిస్ (120), మాథ్యూ షార్ట్ (63), అలెక్స్ కేరీ (69), లబుషేన్ (47) చెలరేగి ఆసీస్‌కు చరిత్రాత్మక విజయం అందించారు. అఫ్ఘాన్‌పై విజయం సాధించి సెమీస్ రేసులో ఉండాలని ఇంగ్లాండ్ ప్రణాళికలు రచిస్తోంది. బౌలింగ్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ గాయం కారణంగా మిగిలిన మ్యాచ్‌లకు దూరం కాగా.. అతడి స్థానంలో లెగ్ స్పిన్నర్ రెహాన్ అహ్మద్‌ను జట్టులోకి తీసుకున్నారు. డకెట్, జో రూట్ ఫామ్‌లో ఉండగా.. ఫిల్ సాల్ట్, బట్లర్, హ్యారీ బ్రూక్ కూడా రాణించాలని ఇంగ్లాండ్ టీమ్‌మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. ముఖ్యంగా బౌలింగ్ ఇంగ్లాండ్‌ను కలవరపెడుతోంది. ఆసీస్‌పై 352 పరుగుల లక్ష్యాన్ని కూడా ఆ జట్టు కాపాడుకోలేకపోయింది. పేసర్లు జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్ బంతితో మెరవడంపై ఆ జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

**అఫ్ఘాన్ షాకిస్తుందా?**

అఫ్ఘానిస్థాన్‌ను తక్కువ అంచనా వేయడానికి లేదు. ఆ జట్టు ఒకప్పటిలా లేదు. తనదైన రోజున మేటిజట్లకు షాకిస్తుంది ఆ టీమ్. 2024 ప్రపంచ కప్‌లో ఆసీస్‌ను ఓడించి అఫ్ఘానిస్థాన్ సెమీ ఫైనల్ చేరిన విషయం ఇప్పటికీ గుర్తుండే ఉంటుంది. సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో రహ్మత్ షా(90) మంచి ప్రదర్శన చేశాడు. ఇబ్రహీం జద్రాన్, రెహ్మనుల్లా గుర్బాజ్, అజ్మతుల్లా ఒమర్జాయ్ రాణిస్తే అఫ్ఘాన్ బ్యాటింగ్ కష్టాలు తీరినట్లే. రషీద్ ఖాన్, మహ్మద్ నబీ, నూర్ అహ్మద్‌లతో స్పిన్ విభాగం పటిష్టంగా ఉంది. గుల్బాదిన్ నైబ్ ఇటు బంతి, అటు బ్యాట్‌తోనూ ప్రభావం చూపగలడు. ఏది ఏమైనా ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో అఫ్ఘాన్ గట్టిగా పోటీస్తుందనడంలో సందేహం అక్కర్లేదు.

## వన్డేల్లో సచిన్ పరుగుల రికార్డును కోహ్లీ బద్దలు కొడతాడు

### రికీ పాంటింగ్



ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ (100లి) సెంచరీ బాదాడు. అదిరే ఆటతో భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో కోహ్లీపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కోహ్లీలో ఇంకా పరుగుల దాహం ఉంటే వన్డేల్లో సచిన్ రికార్డును బ్రేక్ చేస్తాడని రికీ పాంటింగ్ జోస్యం చెప్పాడు. వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన వారి జాబితాలో కోహ్లీ కంటే ముందు ఇద్దరే ఉన్నారు. సచిన్ (18,426), కుమార సంగక్కర (14,234) టాప్-2లో కొనసాగుతుండగా.. కోహ్లీ (14,085) మూడో స్థానంలో ఉన్నాడు. 'కోహ్లీ చాలా కాలంగా ఛాంపియన్‌గా కొనసాగుతున్నాడు. ముఖ్యంగా వైట్‌బాల్ క్రికెట్‌లో అతడు అద్భుతమైన ప్లేయర్. వన్డేల్లో విరాట్ కంటే గొప్ప ఆటగాడిని చూడలేదు. ఇప్పుడు నన్ను దాటేశాడు. అతని కంటే మరో ఇద్దరే ముందున్నారు. వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా గుర్తుండిపోవడానికి తనకు తానే ఓ గొప్ప అవకాశం ఇచ్చుకోవాలని ఆశిస్తున్నా. కోహ్లీ ఇంకా ఫిట్‌గా ఉన్నాడు. ఆటకు కోసం చాలా కష్టపడుతున్నాడు. దీని గురించి ఆలోచిస్తే చాలా క్రేజీగా ఉంటుంది. విరాట్ చాలా కాలంగా అద్భుతంగా ఆడుతున్నాడు. అయినా అతడు సచిన్ కన్నా 4 వేల పరుగుల వెనక్కి ఉన్నాడు. దీన్ని బట్టి సచిన్ ఎంత గొప్ప ప్లేయరో, అతడు ఎంత కాలం కెరీర్‌ను కొనసాగించాడో అర్థమవుతుంది. కోహ్లీలో ఇంకా పరుగుల దాహం ఉంటే సచిన్ రికార్డును బ్రేక్ చేస్తాడు' అని పాంటింగ్ పేర్కొన్నాడు.



## ఇండియా బి టీమ్‌పై కూడా పాక్ గెలవడం కష్టమే : సునీల్ గావస్కర్

ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ చేతిలో ఓడిన పాకిస్థాన్‌పై టీమ్ ఇండియా మాజీ ఆటగాడు సునీల్ గావస్కర్ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. ప్రస్తుతమున్న ఫామ్‌తో పాక్ జట్టు.. ఇండియా బి టీమ్‌ను కూడా గెలవడం కష్టమని ఎద్దేవా చేశాడు. పాకిస్థాన్ ఒకప్పుడు ఎంతో మంది ప్రతిభావంతులైన క్రికెటర్లకు అడ్డాగా ఉండేదన్నాడు. ప్రస్తుతం అత్యున్నత స్థాయిలో రాణించగల ఆటగాళ్లను తయారుచేయడంలో పాక్ విఫలమైందని గావస్కర్ అన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓడి సెమీస్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. చిరకాల ప్రత్యర్థిపై భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొందిన సంగతి తెలిసిందే. 'నాకు తెలిసి ప్రస్తుతం ఉన్న ఫామ్‌తో పాక్ జట్టు.. ఇండియా బి టీమ్‌పై కూడా గెలవడం కష్టం. సి టీమ్ విషయంలో కచ్చితంగా చెప్పలేను. పాకిస్థాన్‌కు బలమైన రిజర్వ్ ఆటగాళ్లు లేకపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పాకిస్థాన్‌లో ఒకప్పుడు సహజ ప్రతిభ కలిగిన ఆటగాళ్లు ఉండేవారు. టెక్నికల్‌గా వారికి అంతపట్టు ఉండకపోయినా ఆట గురించి మంచి అవగాహన ఉండేది. ఉదాహరణకు ఇంజామామ్ ఉల్ హక్‌ను తీసుకోండి. అతనిలా ఉండాలని మీరు ఏ యువ బ్యాటర్‌కు చెప్పరు. కానీ, ఇంజామామ్ మంచి టెంపర్‌మెంట్ కలిగిన ఆటగాడు. ఆ తరహా టెంపర్‌మెంట్‌తో తన టెక్నికల్ లోపాలను సరిచేసుకున్నాడు. అలాంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను పాకిస్థాన్ తయారుచేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వారికి పాకిస్థాన్ సూపర్ లీగ్ కూడా ఉంది. ఐపీఎల్ వల్ల టీమ్‌ఇండియాకు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో చాలామంది యువ క్రికెటర్లు దొరికారు. ఐపీఎల్‌లో మెరిసి రంజీ ట్రోఫీ, టీమ్‌ఇండియాలోనూ ఆడారు. ఒకప్పుడు ఉన్న బెంచ్ బలం ఇప్పుడు ఎందుకు లేదనే దానిపై పాకిస్థాన్ క్రికెట్ తప్పక విశ్లేషించుకోవాలి' అని గావస్కర్ వివరించాడు.

## కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ బాధ్యతలు స్వీకరించేందుకు రెడీగా ఉన్నా : వెంకటేశ్ అయ్యర్



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాబోయే సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టును కెప్టెన్‌గా నడిపించాలని ఉందని ఆ జట్టు ఆల్ రౌండర్ వెంకటేశ్ అయ్యర్ కోరికను వ్యక్తం చేశాడు. తనకు కెప్టెన్‌గా అనుభవం లేదని.. అయినా జట్టును నడిపించే అవకాశం వస్తే అందుకు సిద్ధంగా ఉంటానని తెలిపాడు. ఐపీఎల్ ఈ ఏడాది మార్చిలో ప్రారంభం కానున్నది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్, బెంగళూరు జట్టును ఢీకొట్టనున్నది. అయితే, కేకేఆర్ జట్టుకు కెప్టెన్ లేడు. ఇప్పటి వరకు ఎవరికి జట్టు పగ్గాలు అప్పగిస్తుందనే విషయాన్ని వెల్లడించలేదు. శ్రేయాస్ అయ్యర్ గత సీజన్‌లో కేకేఆర్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయ్యర్‌ను కేకేఆర్ రిటైన్ చేసుకోలేదు. జెడ్డా వేదికగా జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో పంజాబ్ కింగ్స్ జట్టు అయ్యర్‌ను భారీ ధరకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. కెప్టెన్సీపై వెంకటేశ్ అయ్యర్ మాట్లాడుతూ.. జట్టు పగ్గాలు చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించాడు. తాను ఎప్పుడూ ఇదే చెబుతున్నానని.. కెప్టెన్సీ అనేది ఒక ట్యాగ్ మాత్రమేనన్నారు. నాయకత్వంపై నమ్మకం ఉంచుతానని.. కెప్టెన్సీ అనేది పెద్ద రోల్ అని పేర్కొన్నారు. దానిపై ఎలాంటి అస్పష్టత లేదని చెప్పాడు. తనకు అవకాశం వస్తే.. ఖచ్చితంగా చేస్తానని.. చేయకపోవడానికి ఎలాంటి కారణం లేదని తెలిపాడు. ఇంకా మాట్లాడుతూ కెప్టెన్ మంచి రోల్ మోడల్‌గా నిలువాలని వెంకటేశ్ పేర్కొన్నారు. డ్రెస్సింగ్ రూమ్‌లో నాయకుడిగా ఉండేందుకు కెప్టెన్ అనే ట్యాగ్ అవసరం లేదని.. ఒక ఉదాహరణగా ఉండాలని చెప్పాడు. ప్రస్తుతం తాను మధ్యప్రదేశ్‌లో ఉన్నానని.. మైదానంలో, బయట మంచి రోల్ మోడల్‌గా ఉండానని.. తాను మధ్యప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌ని కాదని.. కానీ, నా అభిప్రాయాన్ని గౌరవిస్తారని చెప్పాడు. ఎవరైనా అభిప్రాయాన్ని వ్యక్తీకరించే స్వేచ్ఛ ఉండే వాతావరణంలో జీవించడం తనకు ఇష్టమని చెప్పారు. అందరికీ అభిప్రాయాలు, సూచనలు ఇచ్చే స్వేచ్ఛ ఉండాలని.. వాటిని సరైన స్ఫూర్తితో తీసుకోవాలని చెప్పాడు. ఇదిలా ఉండగా.. కేకేఆర్ జట్టు 2021లో కేకేఆర్‌లో చేరిన వెంకటేశ్ అయ్యర్‌ను గతేడాది వేలానికి ముందు రిలీజ్ చేసింది. కానీ, ఆర్‌సీబీతో వేలంలో పోటీపడి రూ.23.75కోట్లకు తిరిగి కొనుగోలు చేసింది. అయ్యర్ 51 ఐపీఎల్ మ్యాచుల్లో 1,326 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు అన్ని మ్యాచ్‌లను కేకేఆర్ తరఫునే ఆడాడు.



## ఛాంపియన్స్ ట్రోఫీలో దక్షిణాఫ్రియా, ఆస్ట్రేలియా మ్యాచ్ రద్దు

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దక్షిణాఫ్రికా - ఆస్ట్రేలియా మధ్య జరగాల్సిన గ్రూప్ బి మ్యాచ్ రద్దయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా టాస్ పడకుండానే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ ఇచ్చారు. తొలుత వర్షం తగ్గుముఖం పట్టేలా కనిపించడంతో 20 ఓవర్ల చొప్పున ఆడించే అవకాశం ఉందని వార్తలొచ్చాయి. కానీ ఆఖరికి మ్యాచ్‌ను రద్దు చేశారు. గ్రూప్ బి పాయింట్ల పట్టిక చూస్తే.. చెరో మూడు పాయింట్లతో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. నెట్ రన్‌రేట్ బాగుండటంతో సఫారీలు తొలి స్థానంలో ఉన్నారు. ఇంగ్లాండ్, అఫ్గానిస్థాన్ పాయింట్ల ఖాతా తెరవాల్సి ఉంది. మరోవైపు ఈ రద్దు కారణంగా ఈ గ్రూపులో ఉన్న నాలుగు జట్లకు ఇంకా సెమీ ఫైనల్స్ అవకాశాలు ఉన్నాయి.



## ధోనీ లాంటి వ్యక్తి కూడా పాక్ జట్టుతో ఏమీ చేయలేడు : సనా మీర్

**లాహోర్ :** ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు పేలవ ప్రదర్శన ఇచ్చింది. దీంతో సొంత ఆటగాళ్లపై మాజీ క్రికెటర్లు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తాజాగా పాక్ ఆటతీరుపై మాజీ మహిళా కెప్టెన్ సనా మీర్ స్పందించారు. ఆటగాళ్లు ఎంపిక సరిగా లేదని వ్యాఖ్యానించారు. "ప్రస్తుతం 15 మంది ఆటగాళ్లున్న పాక్ జట్టుకు.. ఎమ్ఎస్ ధోనీ లేదా యూనిస్ ఖాన్ లాంటి వ్యక్తులను కెప్టెన్‌గా నియమించినా ఈ జట్టుతో ఏమీ చేయలేరు. నేను మ్యాచ్ చూస్తుండగా నా స్నేహితుడి నుంచి ఒక మెసేజ్ వచ్చింది. భారత్ స్కోర్ 100/2.. ఇక మ్యాచ్ చేజారినట్టే అని రాసుంది. జట్టును ప్రకటించి నప్పుడే నాకు తెలుసు ఈ మ్యాచ్ మన చేజారిపోయిందని బదులిచ్చా" అని సనా మీర్ తెలిపారు. "నియమాలకు అనుకూలంగా జట్టు ఎంపిక జరగలేదు. 15 మందితో కూడిన ఆ జట్టును ప్రకటించినప్పుడే టోర్నీలో సగం మ్యాచ్‌లు ఓడినట్టే అని అనుకున్నా. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతో జరిగిన గత రెండు సిరీస్‌లలో ఆడిన కీలక ఆటగాళ్లను సెలక్షన్ కమిటీ తొలగించింది" అని ఆమె విమర్శించారు. కాగా.. ఛాంపియన్స్ ట్రోఫిలో భాగంగా న్యూజిలాండ్, భారత్‌తో జరిగిన మ్యాచుల్లో ఆతిథ్య పాకిస్థాన్ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత తదుపరి మ్యాచుల నుంచి ఆ జట్టు నిష్క్రమించింది.



## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలుమంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాల నడుమ ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు ప్రధాన షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో కాసేపు రాణించాయి. ఓ దశలో సెన్సెక్స్ 300 పాయింట్లు పైగా లాభపడింది. చివరకు సెన్సెక్స్ 147 పాయింట్ల లాభంతో ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 74,440.30 (క్రితం ముగింపు 74,454.41) వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,785.08 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 147 పాయింట్ల లాభంతో 74,602 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో సూచీ 22,625.30 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 22,513.90 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 5 పాయింట్లు నష్టంతో 22,547 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, ఎంఅండ్ఎం, బజాజ్‌ఫైనాన్స్, నెస్లే ఇండియా, జొమాటో, బజాజ్‌ఫిన్‌సర్వ్, మారుతీ సుజుకీ, టైటాన్, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌యూఎల్ షేర్లు లాభపడ్డాయి. సన్‌ఫార్మా, టెక్‌మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, ఎన్టీపీసీ, టాటా మోటార్స్, అల్ట్రా టెక్ సిమెంట్, ఎల్అండ్‌టీ షేర్లు నష్టపోయాయి. మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు క్షీణించాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు 87.21 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.84 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,955.70 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## వారానికి 47.5గంటల పని.. వారాంతంలో నో ఈ-మెయిల్స్

### - క్యాప్‌జెమినీ సీఈఓ



పనిగంటలపై కొంత కాలంగా దేశంలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పనివేళలపై తాజాగా క్యాప్‌జెమినీ ఇండియా సీఈఓ అశ్విన్ యార్ది స్పందించారు. రోజుకు 9.30 గంటల చొప్పున వారానికి ఐదు రోజులు పనిచేస్తే చాలంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ ఫోరంలో పాల్గొన్న ఆయనకు.. ఓ ఉద్యోగి వారానికి ఎన్ని గంటలు పనిచేయాలని కోరుకుంటున్నారు? అనే ప్రశ్న ఎదురైంది. దానికి ఆయన బదులిచ్చారు. "రోజుకు 9.30 గంటల చొప్పున వారానికి ఐదు రోజులు పనిచేస్తే చాలు. వారాంతంలో ఈ- మెయిల్స్ పంపొద్దు. నాలుగేళ్లుగా నేను పాటిస్తున్న సూత్రం ఇదే" అని తెలిపారు. కొన్ని సార్లు వారాంతాల్లో పని చేస్తానని అంగీకరించారు. కానీ, ఆ సమయంలో ఉద్యోగులకు మెయిల్ పంపనని చెప్పారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న నాస్కామ్ ఛైర్‌పర్సన్ సింధు గంగాధరన్ కూడా ఇదే అభిప్రాయాన్ని పంచుకున్నారు. పనివేళల కంటే ఉత్పాదకతే ముఖ్యమన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పనిచేయాలని ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను కొందరు సమర్థించగా.. మరికొందరు వ్యతిరేకించారు. వారానికి 90 గంటల పాటు పనిచేయాలంటూ ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలూ నెట్టింట చర్చకు దారితీశాయి.

## అస్సాంలో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ భారీ పెట్టుబడి ప్రణాళిక

జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ అస్సాంలో సిమెంట్ తయారీ, పునరుత్పాదక, థర్మల్ పవర్ రంగాలలో పెట్టుబడులు పెట్టే ప్రణాళికను ప్రకటించారు. అడ్వాంటేజ్ అస్సాం 2.0 సమ్మిట్‌లో జిందాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతో సహా అస్సాం వృద్ధికి గణనీయంగా తోడ్పడాలని గ్రూప్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అడ్వాంటేజ్ అస్సాం 2.0 ఇన్వెస్ట్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్‌లో జిందాల్ మాట్లాడుతూ, అస్సాం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఈ వృద్ధి ప్రయాణంలో భాగం కావడానికి జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ కట్టుబడి ఉందని అన్నారు. దేశంలోని మిగిలిన ప్రాంతాల మాదిరిగానే ఈ ఈశాన్య రాష్ట్రం కూడా అదే వేగంతో పురోగమిస్తోందని జిందాల్ అన్నారు.

JSW



## మార్కెట్లోకి సరికొత్త డిజర్ట్ ఎక్స్ డిస్కవరీ..

### ధర రూ.21.78 లక్షలు..!

ఇటలీకి చెందిన డుకాటీ సంస్థ భారత మార్కెట్లోకి సరికొత్త డిజర్ట్ ఎక్స్ డిస్కవరీ బైకును లాంచ్ చేసింది. దీని ప్రారంభ ఎక్స్‌షోరూమ్ ధర రూ.21.78 లక్షలుగా నిర్ణయించారు. ఇది టూర్ ఫ్రెండ్లీ వెర్షన్ అని పేర్కొన్నారు. ఇప్పటికే భారత్‌లో ఉన్న డిజర్ట్ ఎక్స్, ర్యాలీ వేరియంట్ల మధ్య స్థాయిలో డిస్కవరీని విడుదల చేసినట్లు వెల్లడించారు. సుదీర్ఘ ప్రయాణాల కోసం దీనిలో ప్రత్యేకమైన ఫీచర్లు కూడా ఉన్నాయని వెల్లడించారు. ఇది బ్లాక్, వైట్, రెడ్ కలర్స్‌లో అందుబాటులో ఉంది. ఫ్యూయల్ ట్యాంక్ వద్ద బుల్ బార్ ప్రొటెక్షన్, పెద్ద విండ్‌స్క్రీన్, రేడియేటర్ గార్డ్, బెల్లీగార్డ్, ఇంజిన్ బాష్‌ప్లే, సెంటర్ స్టాండ్, హార్డ్‌కేస్ పెన్నియర్స్ వంటి అదనపు హంగులను సమకూర్చింది. దీంతోపాటు రీప్లేసబుల్ అంశాలతోపాటు కస్టమైజేషన్ ఆప్షన్ కూడా వినియోగదారులకు అందించింది. స్మార్ట్ ఫోన్లకు కనెక్ట్ అయ్యేలా ఐదు అంగుళాల టీఎఫ్‌టీ టచ్ స్క్రీన్, టర్న్ బై టర్న్ నేవిగేషన్‌ను ఐదేళ్లపాటు ఉచితంగా అందించనుంది. హీటెడ్ గ్రిప్, అడ్జెస్టబుల్ 46 ఎంఎం యూఎస్‌డీ ఫ్రంట్ ఫోర్క్స్, డ్యూయల్ 320 ఎంఎం ఫ్రంట్ డిస్క్ బ్రేకులు, 265 ఎంఎం వెనుక బ్రేకులు అమర్చారు. ఈ బైకుకు 937 సీసీ ఎల్-ట్విన్ ఇంజిన్ శక్తిని ఇస్తుంది. దీనికి 6స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌ను అమర్చారు. ఇది అత్యధికంగా 108 హార్స్‌పవర్ ఉత్పత్తి చేయగలదు. రైడర్ అసిస్టెన్స్ సిస్టమ్, ఇంజిన్ బ్రేక్ క్రూజ్‌కంట్రోల్, బై-డైరెక్షనల్ క్విక్ షిఫ్టర్స్ వంటి ఫీచర్లు దీనిలో ఉన్నాయి.





## డెకాయిట్ షూటింగ్ అప్డేట్ ఇచ్చిన మృణాల్

సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థానాన్ని సంపాదించుకున్న మృణాల్ ఠాకూర్ మొదటి సినిమాతోనే మంచి సక్సెస్ అందుకుంది. అయితే మృణాల్ చివరగా విజయ్ దేవరకొండతో కలిసి ఫ్యామిలీ స్టార్ సినిమాతో ఆడియన్స్ ను పలకరించింది. ప్రస్తుతం మృణాల్ అడివి శేష్ తో కలిసి డెకాయిట్ సినిమాలో నటిస్తోంది.  ఈ సినిమాలో మృణాల్ ఫస్ట్ లుక్ ను చూసి అందరూ ఆశ్చర్యపోయారు. మృణాల్ ఫస్ట్ లుక్ తర్వాత డెకాయిట్ నుంచి ఎలాంటి అప్డేట్ వచ్చింది లేదు. దీంతో ఈ సినిమా అప్డేట్స్ తెలుసుకోవాలని ఆడియన్స్ ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే మృణాల్ డెకాయిట్ గురించి అప్డేట్ ఇచ్చింది. పేపర్ వెయిట్‌ను చేత్తో గుండ్రంగా తిప్పుతూ తాను డెకాయిట్ షూట్ లో ఉన్న విషయాన్ని వెల్లడించింది మృణాల్.

ఇప్పటివరకు రొమాంటిక్, ఫ్యామిలీ డ్రామా సినిమాల్లో నటించిన మృణాల్ కు ఈ సినిమా పూర్తి భిన్నంగా ఉండనుంది. మృణాల్ నటిస్తున్న మొదటి థ్రిల్లర్ సినిమా డెకాయిట్. ఫస్ట్ లుక్ లో మృణాల్ ను చూసి షాకైన అభిమానులు ఈ యాక్షన్ థ్రిల్లర్ లో అమ్మడిని ఎప్పుడెప్పుడు చూస్తామా అని ఎదురుచూస్తున్నారు. పోస్టర్ లో మృణాల్ లుక్ చాలా భీకరంగా కనిపించడంతో డెకాయిట్ పై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. ఇదిలా ఉంటే డెకాయిట్ మూవీతో షానీల్ డియో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నాడు. సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతుంది. తనకు ద్రోహం చేసిన తన ఎక్స్ లవర్ పై ప్రతీకారం తీర్చుకునే కోపంతో ఉన్న దోషి కథగా డెకాయిట్ ఉ ండబోతుంది. ఈ సినిమాపై అడివి శేష్, మృణాల్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాస్తవానికి ఈ సినిమా ముందుగా శృతి హాసన్ దగ్గరకు వెళ్లింది. టీజర్ కూడా రిలీజ్ చేసిన తర్వాత కొన్ని కారణాల వల్ల శృతి తప్పుకోవడంతో ఆ ప్లేస్‌లోకి మృణాల్ వచ్చింది.

## 50 వయసులో సుస్మితా సేన్ పెళ్లి?



మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్ (49) పెళ్లికి సిద్ధంగా ఉన్నా కానీ.. అలాంటి నిబద్ధతకు నిజంగా అర్హుడైన భాగస్వామి అవసరమని తాను నమ్ముతున్నానని వ్యాఖ్యానించింది. ఒక అభిమాని తన పెళ్లి ప్రణాళికల గురించి ప్రశ్నించగా.. తాను కూడా వివాహం చేసుకోవాలనుకుంటున్నానని, కానీ సరైన వ్యక్తిని కనుగొనాల్సి ఉందని సుష్ చెప్పింది. పెళ్లి అనేది యాధృచ్ఛికంగా జరిగే విషయం కాదని.. దానిని లోతైన భావోద్వేగ సంబంధంగా నిర్మించాలని నమ్ముతున్నానని తెలిపింది. హృదయం స్వీకరిస్తేనే పెళ్లి అని కూడా వ్యాఖ్యానించింది. బ్లాక్ టీషర్ట్ ధరించిన సుష్ ప్రత్యేక వేషధారణలో కనిపించిన ఓ వీడియోను ఎక్స్ ఖాతాలో షేర్ చేస్తూ కొంతమంది సూపర్ స్పెషల్ వ్యక్తులతో ఒక ప్రత్యేక లైవ్ సెషన్ లో పాల్గొంటున్నానని తెలిపారు. లైవ్ లో సుస్మితా సేన్ అభిమానులతో సంభాషించారు. సోషల్ మీడియాల్లో అభిమానులు సుష్ ఆనందంగా ఉండాలని కోరుకున్నారు. దేవుని ఆశీర్వాదం బలం, ఆనందం ఎప్పుడూ మీతో ఉండాలని కొందరు అభిమానులు ఆకాంక్షించారు. సుస్మితాసేన్ పెళ్లి విషయంలో స్పష్టంగానే ఉంది. 50 వయసుకు చేరువలో ఈ కోరిక మరింత బలంగానే ఉంది. కానీ సరైన వాడు లభించలేదనే ఆవేదన స్పష్టమవుతోంది. సుష్మితా సేన్ వ్యక్తిగత జీవితం గురించి తరచి చూస్తే.. ఇటీవలి వ్యాపారవేత్త, ఐపీఎల్ ఫౌండర్ లలిత్ మోడీతో డేటింగ్ ప్రారంభించి కొన్ని నెలల్లోనే అతడికి బ్రేకప్ చెప్పడం సంచలనమైంది. 2022లో మోడీ సోషల్ మీడియా ద్వారా తమ సంబంధాన్ని ధృవీకరించారు. మాల్దీవులు-సార్డినియా వంటి దీవుల నుంచి ఫోటోలను పంపించి ప్రకంపనలకు తెర తీసారు. కొన్ని నెలల తర్వాత మోడీ తన బయో నుండి సేన్ పేరును తొలగించి, తన ప్రొఫైల్ ఫోటోని మార్చుకున్నాక బ్రేకప్ ఖరారైంది.

## వాళ్లిద్దరి పాలిట రష్మిక అదృష్ట దేవతవ్వాలా!

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ఎదురు లేకుండా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. వరుస విజయాలతో పాన్ ఇండియాలోనే అమ్మడు ఓ బ్రాండ్ గా మారిపోయింది. టాలీవుడ్ అయినా..బాలీవుడ్ అయినా? రష్మిక సినిమా చేసిందంటే? అదో బ్రాండ్ గా మారిపోతుంది. %-%యానిమల్%-% లో రణబీర్ కి కపూర్ కి జోడీగా నటించింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయింది. బాక్సాఫీస్ వద్ద 900 కోట్ల వసూళ్లను సాధించింది. రణబీర్ కపూర్ కి ఇమేజ్ ని తెలుగులోనే పెంచింది. ఇక %-%పుష్ప-2%-% లో శ్రీవల్లిగా అమ్మడు ఏ రేంజ్ లో పెర్ఫార్మెన్స్ ఇచ్చిందో చెప్పాల్సిన పనిలేదు. నటనతో పాటు %-%ఫీలింగ్స్ ఫీలింగ్స్%-% అంటూ ఓ ఊపు ఊపేసింది. ఈ సినిమా ఏకంగా %-%బాహుబలి2%-% రికార్డులనే చెరిపేసింది. బాక్సాఫీస్ వద్ద 1870 కోట్లకు పైగావ సూళ్లను సాధించింది. ఇక ఇటీవల రిలీజ్ అయిన %-%ఛావా%-%తో కొత్త ఇమేజ్ ని క్రియేట్ చేసుకుంది.  ఏసుబాయి పాత్రలో రష్మిక నటన నటిగా మరో మెట్టు పైన నిలబెట్టింది. ఈ సినిమా 400 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. వరుస విజయాల్లో ఉన్న విక్కీ కౌశల్ ని ఈ విజయం మరింత గొప్ప స్థానంలో నిలబెట్టింది. ఇలా వరుసగా రష్మిక మొత్తంగా 3000 కోట్లకు పై వసూళ్ల ప్రాజెక్ట్ ల్లో భాగమైంది. వాటిలో రష్మిక పాత్ర ఎంతో కీలకమైందన్నది కాదనలేని నిజం. దీంతో రష్మిక పై బరువైన బాధ్యత పడింది. ప్రస్తుతం రష్మిక-సల్మాన్ ఖాన్ జంటగా మురగదాస్ %-%సికిందర్%-% చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. భారీ యాక్షన్ థ్రిల్లర్ ఇది. రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో మంచి హైప్ క్రియేట్ అవుతుంది. అయితే సల్మాన్ ఖాన్ -మురగదాస్ ఇద్దరు ప్లాప్ ల్లోనే ఉన్నారు. కొంత కాలంగా వారు చేస్తోన్న ప్రయత్నాలేవి బాక్సాఫీస్ వద్ద ఫలించడం లేదు. ఇంకా చెప్పాలంటే %-%టైగర్ 3%-% తర్వాత సల్మాన్ కి సరైన హిట్ ఒక్కటీ లేదు. %-%సర్కార్%-% తర్వాత మురగదాస్ కి కూడా సక్సెస్ పడలేదు. ఆ తర్వాత చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో ఇద్దరికీ రష్మిక తనలో సక్సెస్ సెంటిమెంట్...లక్ ని షేర్ చేయాల్సిన సమయం ఇది. రష్మిక సక్సెస్ వేవ్ లో భాగంగా %-%సికిందర్%-% కూడా బ్లాక్ బస్టర్ అవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com